
నవతెలంగాణ 1
మెదక్, సంగారెడ్డి, సిద్దిపేట
సోమవారం 6 ఫిబ్రవరి 2023



మిథాలీ అగర్వాల్‌కు 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' అవార్డు



నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ హైదరాబాద్ పబ్లిక్ రిలేషన్స్ అధికారి మిథాలీ అగర్వాల్ ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ అవార్డుకు ఎంపికయ్యారు. సాంస్కృతిక మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలో దేశ వ్యాప్తంగా కొనసాగుతున్న 'ఆజాదీ కా అమృత్ మహోత్సవ్' కార్యక్రమం కింద ఢిల్లీలో నిర్వహించిన లాలీ(లోరీ) పోటీలో మిథాలీ అగర్వాల్ ఎంట్రీ సంగారెడ్డి జిల్లా స్థాయిలో ప్రథమ బహుమతికి ఎంపికైంది. రాష్ట్ర స్థాయిలో ద్వితీయ బహుమతికి ఎంపికయ్యారు. ఐఐటీ పీఆర్‌ఓ మిథాలీ అగర్వాల్‌కు ఢిల్లీలో సాంస్కృతిక మంత్రిత్వ శాఖ నుంచి రూ.75 వేల నగదుతో పాటు సర్టిఫికెట్‌ను అందజేయనున్నారు. పీఆర్‌ఓ మిథాలీ అగర్వాల్‌కు అవార్డు రావడం పట్ల ఐఐటీహైదరాబాద్ డైరెక్టర్లు, ప్రొఫెసర్లు హర్షం వ్యక్తం చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



నవతెలంగాణ-మర్కుక్

మండల పరిధిలోని పాములపర్తి జిల్లా పరిషత్ పాఠశాలలో 2004-2005బ్యాచ్ కు చెందిన విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనం ఆదివారం నిర్వహించారు.ఈ సందర్భంగా ఉపాధ్యాయులను పూర్వ విద్యార్థులు ఘనంగా సన్మానించారు. పాఠశాల దశలో చేసిన చిలిపి చేష్టలు, గత స్మృతులను జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఒక్కరినొక్కరు ఆత్మీయంగా పలకరించుకున్నారు.పూర్వ విద్యార్థులు అందరు కలసి కుటుంబ సభ్యులతో పోటోలు దిగారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సత్యనారాయణ, సంజీవరెడ్డి, గంగాధర్ రెడ్డి, శ్రీదేవీ, సునిత, సుజాత, పూర్వ విద్యార్థులు ఉప్పరి నర్సింలు, పాములపర్తి కర్ణాకర్ నగేష్, మహేష్, అనిల్, సుధాకర్, హైమద్, నవనీ, కవిత, సుమతీ, భవానీ, సరోజ, మాధవి, శ్రీదేవీ, అనిత తదితరులున్నారు.

మున్సిపల్ అవిశ్వాసాలకు.. నాలుగేళ్ల గడువు?

- జీవో జారీకి ప్రభుత్వం కసరత్తు
- అప్పటి వరకు ఆమోదించొద్దంటూ కలెక్టర్లకు ఆదేశాలు
- బుజ్జగింపులతో చల్లబర్చే ప్రయత్నాలు
- కలెక్టర్ ఎదుట 50 శాతం కంటే ఎక్కువ సభ్యులు సంతకాలు పెట్టాల్సిందే
- సంగారెడ్డి, అందోల్-జోగిపేట అవిశ్వాలు పక్కన పెట్టిన అధికారులు
- నేడు కలెక్టర్‌ను కలిసేందుకు కౌన్సిలర్ల ప్రయత్నం
- ఉమ్మడి మెదక్ జిల్లాలో మున్సిపల్స్‌లో అసమ్మతి తలనొప్పులు

మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లపై అవిశ్వాస తీర్మానాలు పెట్టే తంతు ఓ పక్క సాగుతుండగా వాటికి చెక్ పెట్టేందుకు ప్రభుత్వం మరో పక్క ప్రయత్నాలు చేస్తోంది. ఉమ్మడి మెదక్ జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలను అధికార పార్టీనే కైవసం చేసుకుంది. మూడేళ్ల తర్వాత రెండు గ్రూపులుగా చీలిన కౌన్సిలర్లు పార్టీకి తలనొప్పులు తెస్తున్నందున... వాటికి చెక్ పెట్టేందుకు అవిశ్వాసం పెట్టే గడువును పెంచాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. గడువు పెంచి అసమ్మతి సెగలపై నీళ్లు చల్లాలని బీఆర్‌ఎస్ నేతలు చూస్తున్నారు.

నవతెలంగాణ-మెదక్ ప్రాంతీయ ప్రతినిధి

అధికార పార్టీ అంతా బాగుందనుకున్న వేళ స్థానిక సంస్థల్లో అసమ్మతి సెగలు రగిలాయి. బీఆర్‌ఎస్ మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లను దించి తాము కూర్చోవాలనుకున్న వాళ్లు మెజార్టీ సభ్యుల్ని కూడేసుకుని వేరు కుంపట్లు పెడుతున్నారు. సీఎం కేసీఆర్, ఆర్థిక మంత్రి హరీశ్‌రావు స్వంత జిల్లా సిద్దిపేట సిగలోనే చేర్యాల చైర్మన్, వైస్ చైర్మన్‌పై అవిశ్వాస తీర్మానం ప్రకటించారు. ముందస్తు ఒప్పందం మేరకు చైర్మన్ పదవిని ఫిఫ్టీ ఫిఫ్టీ అనుకున్నారు. రెండున్నరేళ్లు పూర్తయినా చైర్మన్ పదవి వదులుకోవట్లేదని అధికార పార్టీకి చెందిన వాళ్లే తిరుగుబాటు చేశారు. 12 మంది కౌన్సిలర్లకుగాను టీఆర్‌ఎస్-5, కాంగ్రెస్-5 స్వతంత్రులిద్దరు గెలిచారు. స్వతంత్రుల మద్దతుతో చైర్మన్ అయిన స్వరూపరాణి మూడేళ్లైనా పదవి దిగలేదంటూ ఇండిపెండెంట్‌గా గెలిచి టీఆర్‌ఎస్‌లో చేరి మద్దతిచ్చిన జుబేదాఖాతూం తిరుగుబాటు చేసి 11 మందితో కలిసి అవిశ్వాసం ప్రకటించారు. చైర్మన్ నిర్వహించిన సమావేశానికి వీరెవ్వరూ హాజరుకాలేదు. సంగారెడ్డి చైర్‌పర్సన్ బొంగు విజయలక్ష్మీరవి, వైస్ చైర్మన్ లతావిజేందర్‌రెడ్డి ఒంటెత్తు పోకడలు పోతున్నారంటూ బీఆర్‌ఎస్, బీజేపీ, కాంగ్రెస్ వాళు 23 మంది 7వ వార్డు కౌన్సిలర్ విజయలక్ష్మీశేఖర్ నాయకత్వంలో అవిశ్వాసం ప్రకటించారు. అందోల్-జోగిపేట మున్సిపల్ చైర్మన్ మల్లయ్య, వైస్ చైర్మన్‌పై అవిశ్వాసం పెట్టారు. సంగారెడ్డి, అందోల్-జోగిపేట చైర్మన్, వైస్ చైర్మన్లను దించి తామెక్కాలని ఆశపడ్డ కౌన్సిలర్లు వేర్వేరుగా కలెక్టరేట్‌లో అవిశ్వాస పత్రాలను అందజేశారు. సదాశివపేట మున్సిపల్ చైర్‌పర్సన్ పి.జయమ్మను దించాలని అసమ్మతి సిద్ధమవుతున్నట్లు తెలుస్తుంది. వీటితో పాటు నర్సాపూర్ చైర్మన్ మురళీధర్ యాదవ్ బీఆర్‌ఎస్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. ఆయన చైర్మన్ పదవికి రాజీనామా చేయలేదు. అక్కడ బీఆర్‌ఎస్ చైర్మన్ కావాలంటే అవిశ్వాసం పెట్టాలి. ఒక్కదానికి కోసం మిగతా మున్సిపాలిటీలో కంపు పెట్టే అవకాశం ఇచ్చినట్లు అవ్వుదని వదిలేశారు. సంగారెడ్డిలో 8 మున్సిపాలిటీలు, మెదక్‌లో 4, సిద్దిపేట 5 మున్సిపాలిటీల్లోనూ అసమ్మతి సెగలు రగిలే ప్రమాదముంది. అవిశ్వాసం పెట్టే గడువు పెంచే ఛాన్స్ ఉన్నందున ప్రస్తుత చైర్మన్, వైస్ చైర్మన్స్ తమ పదవులకు ఢోకాలేదంటూ ధీమాగా ఉన్నారు.

అవిశ్వాస గడువు 4 ఏళ్లకు పెంచే ఛాన్స్

మున్సిపల్ చైర్మన్ పదవుల కోసం పార్టీలోనే చీలికలు రావడం మంచిదిగాదని భావిస్తున్న బీఆర్‌ఎస్ బాస్ అవిశ్వాస తీర్మానం పెట్టే గడువును పెంచాలని భావిస్తున్నట్లు తెలుస్తోంది. 4 ఏళ్ల పదవి కాలం ముగిసిన తర్వాతే అవిశ్వాసాలకు అవకాశం ఉండేలా చట్టం తీసుకురానున్నట్లు చెబుతున్నారు. శాసన సభా సమావేశాల సందర్భగానే ఈ జీవో రావచ్చంటున్నారు. ఏడాది పాటు గడువు పెంచితే ఇంతలోపు అసెంబ్లీ ఎన్నికలు ముగిసే అవకాశముంది. మళ్లీ అధికారంలోకి వస్తే అవిశ్వాసాల వల్ల సమస్య ఏమీ ఉండదని బీఆర్‌ఎస్ నేతలు చెబుతున్నారు. ఇప్పటికే గడువు పెంచే విషయం గురించి మంత్రి కేటీఆర్, హరీశ్‌రావు ఉమ్మడి మెదక్ జిల్లా నాయకులకు సమాచారం ఇచ్చినట్లు చెబుతున్నారు. అప్పటి వరకు అసమ్మతి గ్రూపును బుజ్జగించాలని జిల్లా నాయకులు ప్రయత్నాలు చేస్తున్నారు. సంగారెడ్డిలో చేనేత అభివృద్ధి సంస్థ చైర్మన్ చింత ప్రభాకర్ అనారోగ్య సమస్యతో అందుబాటులో లేరు. అందోల్-జోగిపేట ఎమ్మెల్యే చంటి క్రాంతికిరణ్ బుజ్జగించే ప్రయత్నాలు చేస్తున్నట్లు చెబుతున్నారు. ఇతర నాయకుల్ని రంగంలోకి దించి బేరసారాలాడి అసమ్మతి కౌన్సిలర్లను శాంతింపజేయాలని చూస్తున్నట్లు తెలుస్తుంది.

నేడు కలెక్టర్‌ను కలువనున్న అసమ్మతి గ్రూపు

సంగారెడ్డిలో 23 మంది కౌన్సిలర్లు సంతకాలు చేసిన అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్‌కు ఇవ్వాలని చూశారు. కలెక్టర్ శరత్ అందుబాటులో లేకపోయే సరికి ఏవోకు ఇచ్చారు. అందోల్-జోగిపేట అసమ్మతి కౌన్సిలర్లు కూడా అవిశ్వాస తీర్మానంతో కలెక్టర్‌కు వచ్చి అదనపు కలెక్టర్ వీరారెడ్డికి ఇచ్చారు. రెండు మున్సిపాలిటీలకు చెందిన కౌన్సిలర్లు ఇచ్చిన అవిశ్వాస పత్రాలకు ఎలాంటి చట్టబద్ధతలేదు. ఎందుకంటే మున్సిపాలిటీలో మొత్తం సభ్యుల్లో 50 శాతం కంటే ఎక్కువ కౌన్సిలర్లు జిల్లా కలెక్టర్ ఎదుట హాజరై సంతకాలు చేసిన అవిశ్వాస తీర్మానాన్ని కలెక్టర్‌కు అందజేస్తేనే చట్టబద్ధత అవుతుంది. సంగారెడ్డి, అందోల్-జోగిపేట అవిశ్వాసాలు అలా జరగనందున వాటిని పక్కన పడేశారు. సోమవారం కలెక్టర్ అందుబాటులో ఉండనున్నందున స్వయంగా కలిసి సంతకాలు చేయాలని రెండు అసమ్మతి గ్రూపులు ప్రయత్నిస్తున్నాయి. సంగారెడ్డి అసమ్మతి కౌన్సిలర్లు క్యాంపుకెళ్లాల్సి ఉన్నా కలెక్టర్‌ను కలిసేందుకు వాయిదా వేసుకున్నారు. కలెక్టర్ శరత్ తీసుకునే నిర్ణయం బట్టి అసమ్మతి గ్రూపు భవితవ్యం తేలనుంది.





చికిత్స పొందుతూ విద్యార్థిని మృతి



నవ తెలంగాణ-కల్హేర్

ప్రేమ విఫలమై మనస్థాపానికి గురై బాలిక రెండంతస్తుల భవనం పైనుంచి దూకి ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండల కేంద్రమైన సిర్గాపూర్ లోని గిరిజన గురుకుల బాలికల కళాశాలలో జరిగిందని ఎస్సై నారాయణ తెలిపారు. కోహీర్ మండలం పీచే రేగడి తండాకు చెందిన లక్ష్మి(16) సంగారెడ్డి జిల్లా సిర్గాపూర్ మండల కేంద్రంలోని గిరిజన గురుకుల బాలికల కళాశాలలో ఇంటర్ బైపీసీ మొదటి సంవత్సరం చదువుతోందన్నారు. లక్ష్మి గత కొద్దిరోజులుగా అదే కళాశాలలోని ఓ అమ్మాయితో చనువుగా ఉంటూ ఆమెకు ప్రేమ లేఖలు రాసిందన్నారు. దీంతో ఆ అమ్మాయి లక్ష్మి రాసిన ప్రేమలేఖలను విద్యార్థులందరి ముందు బహిర్గతం చేసిందన్నారు. దీంతో మనస్థాపానికి గురైన లక్ష్మి కళాశాల రెండో అంతస్తు భవనం పైనుంచి దూకింది. వెంటనే లక్ష్మిని నారాయణఖేడ్ ఆసుపత్రికి తరలించారన్నారు. అనంతరం సంగారెడ్డిలోని సన్రైజ్ ఆసుపత్రికి తరలించారన్నారు. శనివారం ఉదయం గాంధీ ఆసుపత్రికి తరలించారన్నారు. గాంధీ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం లక్ష్మి మృతి చెందిందని ఎస్ఐ తెలిపారు. మృతురాలి తండ్రి నర్సింగ్(నర్సింలు), సాక్షుల వాంగ్మూలం మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

గ్రామ పంచాయతీ సిబ్బంది సమస్యలను పరిష్కరించాలి

నవ తెలంగాణ-సిద్దిపేట అర్బన్

గ్రామ పంచాయతీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కోరుతూ ఈ నెల 12 నుంచి జనగామ జిల్లా పాలకుర్తి నుంచి 28 ఇందిరాపార్క్ వరకు నిర్వహించనున్న పాదయాత్రను జయప్రదం చేయాలని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి చొప్పరి రవికుమార్, గ్రామ పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి తునికి మహేష్ పిలుపునిచ్చారు. ఆదివారం పాదయాత్ర వాల్ పోస్టర్లను కార్మికులతో కలిసి వారు ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీ కార్మికులకు చాలీచాలని వేతనాలు ఇస్తూ వెట్టిచాకిరీ చేయిస్తున్నారన్నారు. పెరిగిన ధరలతో చూస్తే ఒక కుటుంబం బతకాలంటే కనీసం రూ.26 వేల వేతనం అవసరం... రూ.8,500 ఇస్తూ కాలం వెళ్లదీస్తున్నారని తెలిపారు. పెరిగిన ధరలను దృష్టిలో ఉంచుకొని గ్రామపంచాయతీ కార్మికులకు రూ.26 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. వాటిని పెంచే లోపు రాష్ట్ర ప్రభుత్వం తీసుకువచ్చిన జీవో నెంబర్ 60 ప్రకారం పారిశుద్ధ్య కార్మికులకు రూ.15,600, కారోబార్, బిల్ కలెక్టర్లకు రూ.19,500, డ్రైవర్లకు రూ.22,750 వేతనాలు పెంచాలని కోరారు. జీవో నెంబర్ 51ను సవరించి మల్టీపర్పస్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. గ్రామ పంచాయతీ కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, అర్హులైన కార్మికులందరికీ దళితబంధు తో పాటు డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో దేవవ్వ, పోసవ్వ, నర్సయ్య, కరుణ, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.



బడ్జెట్లో మెస్, కాస్మోటిక్ చార్జీలకు అధిక నిధులు కేటాయించాలి: ఎస్ఎఫ్ఐ

నవతెలంగాణ-చిన్నకోదూరు

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టబోయే బడ్జెట్‌లో సాంఘిక సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు మెస్, కాస్మోటిక్ ఛార్జీలు పెంచే దిశగా రూపకల్పన చేయాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రెడ్డమైన అరవింద్ కోరారు. ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సిద్దిపేట జిల్లా చిన్నకోడూరు మండలంలోని ఎస్సీ హాస్టల్‌ను ఆదివారం సందర్శించారు. ఈ సందర్భంగా సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు రెడ్డమైన అరవింద్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం రేపు ప్రవేశ పెట్టబోయే సాంఘిక సంక్షేమ హాస్టల్లో చదువుకునే విద్యార్థినీ విద్యార్థులకు మెస్ మరియు కాస్మోటిక్ ఛార్జీలు పెంచే దిశగా బడ్జెట్ను రూపకల్పన చేయాలని అన్నారు. ప్రభుత్వం అందించే మెస్ మరియు కాస్మోటిక్ చార్జ్ రీ.60 విద్యార్థులకు ఏ విధంగా సరిపోతాయో ఆలోచించాలనీ అన్నారు. ప్రతి నెలా 1,2,3 తేదీలలో సంక్షేమ హాస్టల్లో చదువుకునే విద్యార్థులకు మెడికల్ క్యాంపు నిర్వహించాలన్నారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం బాధ్యతగా తీసుకోని మెస్ మరియు కాస్మెటిక్ చార్జీలు రూ.200కు పెంచాలన్నారు. లేని పక్షాన విద్యార్థులతో కలిసి పెద్ద ఎత్తున అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట జిల్లా సహాయ కార్యదర్శి కర్రోల్ల నవీన్, నాయకులు శ్రీను, రాహుల్, వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.













వైభవంగా మల్లన్న జాతర

- మూడోవారం భారీగా తరలి వచ్చిన భక్తులు
- పరిసర ప్రాంతాల్లో మారుమోగిన మల్లన్న నామస్మరణ

నవ తెలంగాణ-కొమురవెల్లి

కొమురవెల్లి మల్లన్న జాతర ఆదివారం జోరుగా.. వైభవంగా సాగింది. మల్లన్న ఆలయానికి మూడో ఆదివారం సందర్భంగా భక్తులు భారీగా తరలివచ్చారు. మల్లన్న నామస్మరణతో ఆలయ ప్రాంగణాలు మారుమోగాయి. కరీంనగర్, మెదక్, నిజామాబాద్ జిల్లాల నుంచే కాకుండా ఆంధ్రప్రదేశ్. మహారాష్ట కర్ణాటక రాష్ట్రల నుంచి భక్తులు భారీగా తరలి రావడంతో ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసి పోయింది. శనివారం అర్ధరాత్రి నుంచి తెలంగాణతో ఇతర రాష్ట్రాల నుంచి సుమారు ముప్పై వేల మంది వరకు భక్తులు కొమురవెల్లి మల్లన్నను దర్శించుకున్నారని అంచనా. భక్తులకు దేవస్థానానికి సంబంధించిన గదులు చాలకపోవడంతో ప్రయివేటు గదులను ఆశ్రయించారు. మల్లన్నకు మొక్కులు చెల్లించడానికి వచ్చిన భక్తులు స్వామి వారికి తలనీలాలు సమర్పించి స్నానమాచరించి ఒక్కపొద్దులతో మట్టికుండలలో పసుపు బియ్యంతో నైవేద్యం సమర్పించారు. బోనాలను ఎత్తుకొని శివ సత్తులు శిగమూగుతూ డప్పు చప్పుడులతో, ఒక్కపొద్దులతో మట్టికుండలలో పసుపు బియ్యంతో నైవేద్యం సమర్పించారు. గంగరేణు చెట్టువద్ద పట్నాలు వేసి స్వామికి మొక్కులు అప్పగించారు. అనంతరం క్యూలైన్లో వెళ్లి మల్లన్నను దర్శించుకున్నారు. దర్శదర్శనానికి నాలుగు గంటల సమయం, రూ100ల శీఘ్ర దర్శనానికి మూడుగంటల సమయం, రూ.150 విశిష్ట దర్శనానికి రెండు గంటల సమయం, రూ.500 వీవీఐపీ దర్శనానికి గంట సమయం పట్టింది. అనంతరం మల్లన్నగుట్ట (ఇంద్రకీలాద్రి గుట్ట)పై వెలసిన రేణుకా ఎల్లమ్మకు శివసత్తులు. బోనాలు ఎత్తుకుని మొక్కులు చెల్లించారు. రేణుక ఎల్లమ్మకు బోనం సమర్పించడం ఆనవాయితీగా వస్తోంది. స్వామి వారి బ్రహ్మోత్సవాల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా అడిషనల్ డీసీపీ మహేందర్, ఏర్పాట్లను ఆలయ అధికారులు పాలకమండలి సభ్యులు తదితరులు పర్యవేక్షించారు.

మల్లన్న సన్నిధిలో ప్రముఖులు

కొమురవెల్లి మల్లికార్జున స్వామిని శాసనసభ డిప్యూటీ స్పీకర్ పద్మారావుగౌడ్, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి ఆదివారం వేరువేరుగా దర్శించుకున్నారు. ఆలయ వర్గాలు వారికి ఆహ్వానం పలికారు. అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ గీస భిక్షపతి, ఆలయఉద్యోగులు, ఆలయ ప్రధానార్చకులు మహాదేవుని మల్లికార్జున్ తదితరులు పాల్గొన్నారు.

కుల సంఘ భవనాలకు భూమి పూజ



నవతెలంగాణ-కొండపాక

కొండపాక మండలం అంకిరెడ్డిపల్లి గ్రామంలో ఆదివారం గౌడ, రజక సంఘం భవన నిర్మాణాలకు సర్పంచ్ లావణ్యతో కలిసి ఎంపీపీ రాగల సుగుణ దుర్గయ్య భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కేసీఆర్ ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి కృషి చేస్తుందన్నారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఏఈ లింగారెడ్డి, రైతుబంధు సమితి కన్వీనర్ దుర్గయ్య, నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

బురుగుపల్లిలో అభివృద్ధి పనులకు భూమి పూజ



నవతెలంగాణ-గజ్వేల్

గజ్వేల్ మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో సర్పంచ్ వంటేరు విజయవర్ధన్‌రెడ్డితో కలిసి ఆదివారం తెలంగాణ ఫారెస్ట్ చైర్మన్ వంటేరు ప్రతాప్ రెడ్డి అభివృద్ధి పనులకు భూమిపూజ చేశారు. గ్రామంలో సీసీరోడ్లు, మురికి కాలువలు వెంటనే పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో మండల కోఆప్షన్ అబ్దుల్, రాజు, చంద్ర గౌడ్ స్వామి భాస్కర్ రెడ్డి ,భరత్ రెడ్డి ,శ్రీనివాస్ రెడ్డి ,బిఆర్ఎస్ నాయకులు ప్రజాప్రతినిధులు తదితరులు గ్రామస్తులు ఉన్నారు.

రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు మాధవరెడ్డి

నవ తెలంగాణ-గజ్వేల్

పేద రెడ్ల అభివృద్ధి కోసం ప్రభుత్వం రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని రెడ్డి జాగృతి వ్యవస్థాపక అధ్యక్షులు బుట్టంగారి మాధవరెడ్డి, కొట్టం మధుసూధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఆదివారం రెడ్డి జాగృతి ఆధ్వర్యంలో గజ్వేల్‌లోని పీఎస్ఆర్ గార్డెన్‌లో రెడ్ల ఆత్మీయ సభ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ ఇచ్చిన హామీ మేరకు ఐదువేల కోట్ల తో రెడ్డి కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని, ఈ డబ్ల్యూ ఎస్ రిజర్వేషన్ ను సంపూర్ణంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. రెడ్డి విద్యార్థులకు విదేశాలలో చదువుకోవడానికి 20 లక్షల రూపాయల విదేశీ విద్యా పథకం ప్రవేశపెట్టాలని, దళిత బంధు పథకం లాగానే రెడ్లకు ప్రత్యేక పథకాన్ని ఏర్పాటు చేసి అమలు చేయాలని, ఎస్సీ బీసీ గురుకులాల మాదిరిగానే రెడ్డి గురుకులాలు ఏర్పాటు చేయాలని వారు ప్రభుత్వాన్ని కోరారు. అలాగే రైతులకు అన్నింటిలో సబ్సిడీ ఇస్తున్న విధంగానే రెడ్ల రైతులకు కూడా సబ్సిడీ ఇవ్వాలని కోరారు. వచ్చే ఎన్నికలలో అసెంబ్లీ సీట్లలో ప్రాధాన్యత కల్పించాలని, రెడ్డిలు రాజకీయంగా ఎదగడాన్ని అడ్డుకుంటున్నారని దీనిని రెడ్డిలంతా తిప్పి కొట్టాల్సిన అవసరం ఉందన్నారు. రాష్ట్రంలోని రెడ్డిలందరిని ఏకం చేయడానికి 100 రోజులలో 12 రెడ్డి ఆత్మీయ సభలను నిర్వహించ తలపెట్టామని, గజ్వేల్ నుంచి ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టామని మాధవరెడ్డి మధుసూదన్ రెడ్డిలు పేర్కొన్నారు. ఈ సందర్భంగా పలు తీర్మానాలు చేశారు. ఈ కార్యక్రమంలో రెడ్డి జాగృతి నాయకులు నరసింహారెడ్డి, బాలకృష్ణారెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వసంత రెడ్డి, రాకేష్ రెడ్డి, సతీష్ రెడ్డి, మధుసూదన్ రెడ్డి, రాజిరెడ్డి, చంద్రశేఖర్ రెడ్డి, రాజేందర్ రెడ్డి, దయాకర్ రెడ్డి, మమతారెడ్డి, లావణ్య, సంధ్య, ఆంక్ష రెడ్డి, పుష్పలత, దీపికా రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



హైకోర్టు చీఫ్‌జస్టిస్‌కు స్వాగతం పలికిన కలెక్టర్





నవ తెలంగాణ-కొండపాక

తెలంగాణ రాష్ట్ర హైకోర్టు చీఫ్ జస్టిస్ ఉజ్జల్ భువన్‌కు జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ ఆదివారం హరిత హెూటల్ వద్ద పుష్ప గుచ్ఛం అందజేసి స్వాగతం పలికారు. పెద్దపల్లి జిల్లా నంది మేడారంలో జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ప్రారంభోత్సవానికి ముఖ్యఅతిథిగా వెళ్తూ నాగుల బండ వద్దగల హరిత మినర్వా హెూటల్ లో బ్రేక్ ఫాస్ట్ కోసం ఆగారు. జిల్లా కలెక్టర్ ప్రశాంత్ జీవన్ పాటిల్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు. అనంతరం హెూటల్ ప్రాంగణంలో హైకోర్టు చీఫ్ జస్టిస్ కోర్టు జడ్జి జస్టిస్ రఘురాంతో కలిసి మొక్కను నాటారు. చీఫ్ జస్టిస్ వెంట హైకోర్టు జడ్జ్ లు పి. నవీన్ రావ్, ఎస్.వి. శ్రావన్ కుమార్, అభిషేక్ రెడ్డి జిల్లా న్యాయవాదులు, కమిషనర్ ఆఫ్ పోలిస్ శ్వేత తదితరులు ఉన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయాలి

నవతెలంగాణ-కొండపాక

ప్రజల సమస్యల పరిష్కారం కోసం కార్యకర్తలు ఎప్పటికప్పుడు పని చేయాలని బీజేపీ రాష్ట్ర నాయకులు దారం గురువారెడ్డి అన్నారు. ఆదివారం కొండపాకలో ఉమ్మడి మండల అధ్యక్షుడు శశిధర్‌రెడ్డి అధ్యక్షతన కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ధరణి సమస్యలతో ప్రజలు ఎదుర్కొంటున్న విషయాలను తెలుసుకొని తెలుపాలన్నారు. పార్టీ బలోపేదానికి ప్రతి కార్యకర్త కృషి చేయాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు రాములు,జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షులు రామస్వామి, యువమోర్చ జిల్లా ఉపాధ్యక్షులు మనోహర్ యాదవ్, జిల్లా యస్ సి మోర్చా ప్రధాన కార్యదర్శి శివ,మండల ప్రధాన కార్యదర్శి దాసరి భానుచందర్, ఉపాధ్యక్షులు నీల సత్యం, ఆరేపల్లి లింగం, బూర్గు గంగయ్య, యువమోర్చ అధ్యక్షులు సుంచు ఉపేందర్,కోశాధికారి శ్రీహరి,కార్యవర్గ సభ్యులు దాసరి స్వామి, బాషమైన ప్రశాంత్, కార్యదర్శి షేర్ నరేందర్, సోషల్ మీడియా కన్వీనర్ తాళ్లపల్లి ప్రవీణ్ గౌడ్,శక్తి కేంద్ర ఇన్చార్జ్ లు రెడ్డమైన లింగం, వాసరి కనకరావు తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉర్సు ఉత్సవాలు



నవతెలంగాణ-న్యాల్‌కల్

న్యాల్‌కల్‌లోని పీర్ గెబ్ సాహెబ్ దర్గా ఉత్సవాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. ఆదివారం సెలవు దినం కావడంతో భక్తులు పెద్ద ఎత్తున దర్గాను దర్శించుకు న్నారు. ఉదయం నుంచే సందర్శకుల పోటెత్తింది. కాగా ఉత్సవాల్లో భాగంగా ఆదివారం నిర్వహించిన పశువుల సంత అందరినీ ఆకట్టుకున్నది. ఉత్తమ పశులను ప్రదర్శించిన వారికి సిహెచ్ సురేష్, గిరజ బాహి - అడివప్ప జ్ఞాపకార్థం జెడ్పీటీసీ బి.స్వప్న భాస్కర్, జహీరాబాద్ డీఎస్పీ రఘు, ఎస్సై వినయ్ కుమార్ చేతుల మీదుగా బహుమతులు అందజేశారు. సర్పంచ్ తనయుడు శివ స్వామి, ఉత్సవ కమిటీ నిర్వాహకులు యూనుస్ ఖాన్, ఇసాం పటేల్, మకుసుదు అలీ, వాహాబ్, గ్రామస్తులు ఉత్తమ శిల్పకారుడు ప్రకాష్, బసవరాజ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

కన్యకాపరమేశ్వరి దేవాలయాన్ని దర్శించుకున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-రామచంద్రాపురం

భారతి నగర్ డివిజన్ పరిధిలోని శ్రీశ్రీశ్రీ కన్యకా పరమేశ్వరి దేవాలయంలో పౌర్ణమి సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో పటాన్చెరువు శాసనసభ్యులు గూడెం మహిపాల్‌రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ ఆవరణలో నిర్మిస్తున్న గాలిగోపురం గడప పూజా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. బీఆర్ఎస్ సీనియర్ నాయకులు ఆదర్శ్‌రెడ్డి, సర్కిల్ అధ్యక్షులు పరమేష్ యాదవ్, ఆలయ కమిటీ ప్రతినిధులు ఉన్నారు.





సంస్కృతి సంప్రదాయాల పరిరక్షణలో విద్యాభారతి సంస్థల పాత్ర ప్రశంసనీయం

నవతెలంగాణ-రామచంద్రాపురం

సమాజంలో విద్యార్థి దశ నుండే నుండి భారతదేశ సంస్కృతి సాంప్రదాయాలను అందించడంలో విద్యా భారతి సంస్థల పాత్ర ప్రశంసనీయమని పటాన్చెరు శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. తెల్లాపూర్ డివిజన్ పరిధిలోని ఈదుల నాగులపల్లిలో విద్యాభారతి సంస్థ పాఠశాల నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మనిషి జీవితంలో విద్యార్థి దశ అత్యంత కీలకమని అన్నారు. భావి భారత పౌరులుగా తీర్చిదిద్దడంలో విద్యాసంస్థలు కీలకపాత్ర పోషించాలని కోరారు. లక్షల మంది విద్యార్థులు తయారు చేసిన విద్యా భారతి సంస్థ భవిష్యత్తులోనూ ఇదే స్ఫూర్తితో పని చేయాలని అభిలాషించారు. మున్సిపల్ చైర్మన్ లలితా సోమిరెడ్డి, వైస్ చైర్మన్ రాములు గౌడ్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ, కౌన్సిలర్లు రవీందర్ రెడ్డి, రాజు, పిఏసిఎస్ చైర్మన్ బుచ్చిరెడ్డి, విద్యాబారతి సంస్థల పాఠశాలల అధ్యక్షుడు దామోదర్ రెడ్డి, కార్యదర్శి గాల్ రెడ్డి, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



వివాహ వేడుకల్లో పాల్గొన్న కల్హేర్ జెడ్పీటీసీ

నవతెలంగాణ-కల్హేర్

మండలంలోని కృష్ణాపూర్ గ్రామానికి చెందిన చెందిన చిట్యాల నాగరాజు వివాహం కామారెడ్డి జిల్లా పిట్లం మండల కేంద్రంలో ఆదివారం జరిగింది. ఈ వివాహ కార్యక్రమానికి కల్హేర్ జెడ్పీటీసీ నరసింహారెడ్డి గ్రామ సర్పంచ్ కిష్టారెడ్డి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి వివాహ శుభాకా క్షలు తెలిపారు. అనంతరం మెదక్ జిల్లా పెద్దశంకరంపేటలో జరిగిన కుమ్మరి ఆంజయ్య కుమార్తె వివాహ కార్యక్రమానికి హాజరై నూతన వధూవరులను ఆశీ ర్వదించారు. క్రిష్ణాపూర్ గ్రామ సర్పంచ్ కిష్టారెడ్డి, మాజీ ఎంపీటీసీ శ్రీనివాస్ గౌడ్, సొసైటి వైస్ చైర్మెన్ రాంరెడ్డి స్వామి, సంగయ్య సార్, కుమ్మరి రాములు, హన్మాండ్లు, గోపాల్ రెడ్డి, వెంకట్, బైరు రవి, భూపతి, రాములు పాల్గొన్నారు.



కాంగ్రెస్ మహిళా అధ్యక్షులుగా శారద భాస్కర్ రెడ్డి

నవతెలంగాణ-న్యాల్‌కల్

కాంగ్రెస్ పార్టీ మాజీ మంత్రి జె.గీతారెడ్డి ఆదేశాలతో న్యాల్‌కల్ మండల కాంగ్రెస్ మహిళా అధ్యక్షు రాలుగా కె.శారద భాస్కర్ రెడ్డిని నియ మించారు. ఈ మేరకు నియామక పత్రాన్ని సంగారెడ్డి జిల్లా అధ్యక్షులు కాట సుధారాణి చేతుల మీదుగా అందజేశారు. మాజీ జెడ్పీటీసీగా, మిర్జాపూర్ (ఎన్) మాజీ సర్పంచ్‌గా పదవులు చేసి.. మంచి పట్టున్న నాయకురాలికి ఇలాంటి పదవి దక్కడం సంతోషకరమని సీనియర్ నాయకులు కె. భాస్కర్ రెడ్డి విలేకరులతో తెలిపారు. కాగా మాజీ మంత్రి గీతారెడ్డి గారికి, నాయకులకు, కార్యకర్తలకు కె.శారద భాస్కర్ రెడ్డి గారి ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.



మంగల్‌పేట్ బస్టాండ్ కాంప్లెక్స్‌లో 'అమ్మ భోజనం'

నవతెలంగాణ-నారాయణఖేడ్

పట్టణంలోని మంగల్‌పేట్ బస్టాండ్ కాంప్లెక్స్‌లో అమ్మ భోజనం హెూటల్‌ని ఆర్టీసీ డి.ఎం మల్లేశయ్య ఆదివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా డి.ఎం మాట్లాడుతూ... ప్రయాణికుల అవసరాలను దృష్టిలో పెట్టుకొని కాంప్లెక్స్‌లో హోటల్ ప్రారంభించడం అభినందనీయమన్నారు. రూ.50 కే రుచికరమైన భోజనాన్ని అందిస్తున్నారని.. ప్రయాణికులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆర్టీసీ మార్కెటింగ్ సేల్ ఇంచార్జ్ పాండు, ఓనర్ కంటెం శ్రీను తదితరులు పాల్గొన్నారు.



నేటి పార్టీ కార్యకర్తల సమావేశాన్ని విజయవంతం చేయాలి

నవతెలంగాణ-పుల్కల్

మాజీ డిప్యూటీ సీఎం దామోదర్ రాజనర్సింహ ఆదేశాలతో చౌటకూర్ మండలం శివంపేట గ్రామంలో నేడు(సోమవారం) 12 గంటల సమయంలో కాంగ్రెస్ పార్టీ ముఖ్య కార్యకర్త సమావేశం నిర్వహిస్తున్నట్టు పార్టీ మండలాధ్యక్షులు నత్తి దశరథ్ అన్నారు. ఈ సందర్భంగా ఆదివారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ.. ఈ సమావేశంలో భవిష్యత్తు కార్యాచరణ, ప్రతీ గడపకు పార్టీని తీసుకెళ్లి బలోపేతం చేసేందుకు ప్రణాళికలు రూపొందిస్తారన్నారు. కావున కార్యకర్తలు, నాయకులు పెద్ద సంఖ్యలో హాజరై సమావేశాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

పోస్ట్ ఆఫీస్ ఖాతాతో..

ఇంటి వద్దే నగదు విత్ డ్రా

- పోస్టల్ ఎస్పీ ఎస్‌వీఎల్‌ఎన్ రావు
- పీఎం కిసాన్ లబ్ధిదారులకు తీపి కబురు
- ఈనెల 15 వరకు ప్రత్యేక శిబిరాల నిర్వహణ



నవతెలంగాణ-సంగారెడ్డి

పీఎం కిసాన్ యోజన స్కీమ్ లబ్దిదారులకు పోస్టల్ శాఖ తీపి కబురు అందించింది. పోస్ట్ ఆఫీస్‌లో ఖాతా ఉన్నవారికి ఇంటి నుంచే నగదు విత్ డ్రా చేసుకొనే సదుపాయం కల్పించింది. ఆ మేరకు ఆదివారం సంగారెడ్డి జిల్లా పోస్టల్ సూపరింటెండెంట్ ఎస్‌వీఎల్‌ఎన్ రావు వివరాలు వెల్లడించారు. సంగారెడ్డి జిల్లాలో 14,600 కిసాన్ సమ్మాన్ రైతులకు పిఎం కిసాన్ యోజన స్కీమ్ డబ్బులు వారి అకౌంట్‌లలో జమకావడం లేదని గుర్తించినట్టు తెలిపారు. వెంటనే వారందరూ ఇండియా పోస్ట్ పేమెంట్ బ్యాంక్ పోస్టల్ ఖాతా ఓపెన్ చేసు కోవాలని కోరారు. ఇందు కోసం ఈనెల 15 వరకు జిల్లాలోని అన్ని పోస్ట్ ఆఫీస్ లలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నట్టు చెప్పారు. ఈ అవకాశాన్ని కిసాన్ సమ్మాన్ లబ్దిదారులు సద్వినియోగం చేసుకోవాలని పోస్టల్ ఎస్పీ విజ్ఞప్తి చేశారు. ఈ పథకం కింద లబ్ది పొందాలనుకునే రైతులు ఆధార్ నెంబర్, ఫోన్ నెంబర్ సహాయంతో పోస్ట్ ఆఫీస్ ఐపిపిబీ ద్వారా పోస్టల్ బ్యాంక్ అకౌంట్ ఓపెన్ చేసుకోవాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని రైతులందరూ సులభంగా వారి గ్రామాలలోని పోస్ట్ మ్యాన్ ద్వారా కేవలం రెండు నిమిషాల్లోనే పోస్టల్ బ్యాంకు అకౌంట్ తెరుచు కోవచ్చని ఆయన వివరించారు. జిల్లాలోని రైతులందరూ ఈ సువర్ణ అవకాశాన్ని వినియోగించుకొని ఈనెల 15వ తేదీ లోపల కేంద్రం విడుదల చేసే కిసాన్ సమ్మాన్ నిధి యోజన స్కీమ్ డబ్బులు రూ.2 వేలను పోస్టల్ బ్యాంక్ అకౌంట్ ద్వారా పొందవచ్చున్నారు.

జైపాల్‌రెడ్డితో ముప్పారం ప్రకాష్ భేటీ..

నవతెలంగాణ-జోగిపేట

అందోల్ నియోజకవర్గ రాజకీయ వ్యూహకర్త పట్లోళ్ల జైపాల్‌రెడ్డిని బీఎస్పీ రాష్ట్ర నాయకులు, అందోలు నియోజకవర్గం బాధ్యులు డాక్టర్ ముప్పారం ప్రకాష్ కలిశారు. ఆదివారం ఆయనను కలిసి భవిష్యత్తు రాజకీయ సమీకరణలపై చర్చించారు. బిఎస్పీ తరపున భవిష్యత్తులో చేసే కార్యక్రమాలు జయప్రదంగా జరగడానికి, అందోల్ మండలం డాకూర్ రాజకీయ దురంధరుడు పట్లోల్ల జైపాల్ రెడ్డిని జోగిపేటలో జరిగిన ఓ ప్రైవేట్ కార్యక్రమంలో దళిత సంఘాల నాయకులతో కలిసి, సన్మానించి ఆశీర్వాదాలను స్వీకరించారు. బీఎస్పీ పార్టీ తరపున రాబోవు ఎన్నికల్లో ముప్పారం ప్రకాష్ పోటీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఇందులో భాగంగా నియోజకవర్గ వ్యాప్తంగా మంచి పట్టున్న జైపాల్ రెడ్డితో ఆయన సన్నిహితంగా ఉంటున్నారు. ఇటీవల కాలంలో పలు ప్రైవేట్ కార్యక్రమాలలో ఆయనను కలిసి మద్దతు కూడగడుతున్నారు. బీఎస్పీ అధినేత ఆర్ఎస్



ప్రవీణ్‌కుమార్ కూడా ప్రకాష్ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయనున్నట్లు వినికిడి. ఇప్పటికే అందోలు నియోజకవర్గంలో సుపరిచితులుగా ఉన్న ముప్పారం ప్రకాష్ తన పని తాను చేసుకుంటూ వెళ్తున్నాడు. సామాజిక కార్యక్రమాలు కూడా చేపడుతున్నారు. కరోనా సమయంలో బాధితులకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ప్రభుత్వ వైఫల్యాలను కూడా ఎండగడుతూ ప్రజలను చైతన్యం చేస్తున్నారు.

12వ, 23వ వార్డుల్లో అభివృద్ధి పనులు ప్రారంభం



నవతెలంగాణ-సంగారెడ్డి

సంగారెడ్డిలోని 12వ వార్డులో రూ.20 లక్షల వ్యయంతో సీసీరోడ్డు పనులు, 23వ వార్డులో రూ.18 లక్షల వ్యయంతో డ్రయినేజీ పనులను మున్సిపల్ చైర్‌పర్సన్ బొంగుల విజయలక్ష్మి రవి ఆదివారం ప్రారంభించారు. కాగా వార్డు కౌన్సిలర్లు కూన వనిత సంతోష్, పొన్న రాజేందర్‌రెడ్డిలు చైర్‌పర్సన్ దంపతులను శాలువాతో సత్కరించారు. అనంతరం కొబ్బరికాయలు కొట్టి చైర్‌పర్సన్ పను లను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్ సారథ్యంలో వార్డులు అభివృద్ధి చెందుతున్నా యన్నారు. వార్డు కౌన్సిలర్లు మాట్లాడుతూ.. కాలనీలో రోడ్లు, డ్రయినేజీ పనులు చేపడతామని ఇచ్చిన మాట నిలబె ట్టుకున్నాన న్నారు. పట్టణ అభివృద్ధిలో కలిసికట్టుగా కృషి చేయాలన్నారు. బొంగుల రవి, విజయేందర్ రెడ్డి, కౌన్సిలర్లు తులసి రామ్, ఆర్ఎస్ నాయకులు డా.శ్రీహరి, యువజన సంఘాల అధ్యక్షుడు వేణు గోపాలకృష్ణ, కాలనీ వాసులు పాల్గొన్నారు.

పేద కుటుంబానికి నీలం మధు సాయం





నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని శివానగర్ గ్రామంలో నిరుపేద కుటుంబానికి చెందిన తమ్మలి యాదయ్య భార్య అనసూయ మృతి చెందింది. కాగా మృతురాలి కుటుంబానికి బీఆర్ఎస్ నాయకులు నీలం మధు ముదిరాజ్ ఐదువేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎమ్ ఆర్ యువసేన ప్రతినిధులు పాల్గొన్నారు.

మండలంలోని గడ్డపోతారం గ్రామానికి చెందిన ఎనగండ్ల బాలరాజు అనారోగ్యంతో మృతి చెందాడు. కాగా బీఆర్ఎస్ పటాన్చెరు నియోజకవర్గ నాయకులు నీలం మధు ముదిరాజ్ పది వేల రూపాయలు ఆర్థిక సహాయాన్ని బాలరాజు భార్య వీరమనికి అందించారు. జిన్నారం మండల ముదిరాజ్ సంఘం అధ్యక్షులు నారబోయిన శ్రీనివాస్, గడ్డపోతారు మత్స్యశాఖ అధ్యక్షులు బాలు గారి నర్సింలు, ఎన్ఎంఆర్ యువసేన సభ్యుల, బోయ బిక్షపతి బాలయ్య, మద్దూరు పటేల్ శ్రీకాంత్, నారబోయిన గిరి ప్రసాద్,నర్సింగ్ రావు, సూరారం మణిదీప్, ఉట్ల శ్రీనివాస్, ఆంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

పంచాయతీ సిబ్బంది సమస్యలు పరిష్కరించాలి

- ఈనెల 12నుంచి సీఐటీయూ ఆధ్వర్యంలో పాదయాత్ర

నవతెలంగాణ-సదాశివాపేట

ఈనెల 12వ తేదీ నుండి గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది సమస్యలు పరిష్కరించాలని కోరుతూ జనగామ జిల్లా పాలకుర్తి నుండి ప్రారంభమయ్యే పాదయాత్రలో గ్రామపంచాయతీ కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరుతూ ఆదివారం సదాశివపేట ఎంపీడీవో కార్యాలయం ఆవరణంలో వాల్ పోస్టర్‌ను ఆవిష్కరి ంచారు. ఈ సందర్భంగా గ్రామపంచాయతీ కార్మికుల సంఘం జిల్లా అధ్యక్షులు కే దశరథ్ మాట్లాడుతూ.. ఈనెల 12న జనగామ జిల్లా పాలకుర్తిలో సీఐటీయూ ఆధ్వర్యంలో గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని పాదయాత్ర ప్రారంభిస్తున్నామన్నారు. ఈనెల 28న హైదరాబాదులో ముగింపు సభ ఉంటుందని జయప్రదం చేయాలని కోరారు. గ్రామపంచాయతీలో పనిచేస్తున్న సిబ్బంది అనేక సమస్యలతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ముఖ్యంగా కనీస వేతనాలు ఇవ్వడం లేదన్నారు. కనీస వేతనం రూ.26,000 నిర్ణయించాలని జీవో నెంబర్ 60 ప్రకారం పారిశుద్ధ కార్మికులకు రూ.15,600,



కారోబర్లు బిల్ కలెక్టర్లకు రూ.19,500 కంప్యూటర్ ఆపరేటర్లకు రూ.22,750 వేతనాలు చెల్లించాలన్నారు. జీవో నెంబర్ 51 సవరించి మల్టీపర్పస్ వర్కర్స్ విధానాన్ని రద్దు చేయాలన్నారు. ఉద్యోగ భద్రత ఈఎస్ఐ, పిఎఫ్ ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలన్నారు. అర్హులైన వారందరికీ డబుల్ బెడ్ రూమ్ ఇండ్లు, ఇంటి స్థలం లేని వారికి ఇంటి స్థలం ఇవ్వాలని, అర్హులైన వారందరికీ దళితబంధును అమలు చేయాలన్నారు. ఈ ప్రధాన డిమాండ్లతో పాదయాత్ర నిర్వహిస్తున్నామని పాదయాత్రలో కార్మికులందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. సంఘం మండలాధ్యక్ష కార్యదర్శులు శేఖర్, బుచ్చయ్య, కార్మికులు నరసింహులు, రామచందర్, సంజీవ్, రాములు, రాజు పాల్గొన్నారు.

ఆపదలో ఉన్నవాళ్లకు ఎల్లవేళలా అండగా ఉంటా..

నవతెలంగాణ-ఐడిఏ బొల్లారం

ఆపదలో ఉన్నవారికి తాను ఎల్లవేళలా అండగా ఉంటూ.. చేయూతను అందిస్తానని బీజేపీ నాయకులు, కేజేఆర్ ట్రస్ట్ అధినేత ఆనంద్ కృష్ణారెడ్డి అన్నారు. వినాయకనగర్ కాలనీ 14వ వార్డ్‌కి చెందిన ఓ మహిళా తాను కష్టాల్లో ఉన్నానని, ఆదుకోవా లంటూ బొల్లారంలోని కృష్ణారెడ్డి స్వగృహానికి వచ్చి కన్నీటి పర్యంతమయింది. అది చూసి చలించిన ఆయన బాధిత మహిళకు భరోసా చెప్పి.. 30 కిలోల



బియ్యాన్ని అందజేశారు. అంతేకాకుండా ఆమెకు రేషన్ కార్డు వచ్చే వరకు.. ఓ అన్నగా అండగా వుంటూ.. ప్రతినెల ఇలాగే బియ్యన్ని అందచేస్తానని హామీ ఇచ్చారు.

వావిలాలలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన

నవతెలంగాణ-జిన్నారం

మండలంలోని వావిలాల గ్రామంలో సీసీరోడ్ల నిర్మాణం, తదితర అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి ఆదివారం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పటాన్చెరు నియోజకవర్గ ప్రజల అభివృద్ధి లక్ష్యంగా అన్ని ప్రాంతాల్లో విస్తృతంగా అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహిస్తున్నామన్నారు. అనంతరం గ్రామంలో ఇటీవల అనారోగ్యంతో మరణించిన రాములు, యాదయ్య కుటుంబ సభ్యులను పరామర్శించారు. వారికి అండగా ఉంటామని భరోసా నిచ్చారు. దేశంలోనే మొట్ట మొదటి సారిగా కార్యకర్తలకు రెండు లక్షల రూపాయల ప్రమాద బీమా సౌకర్యం కల్పించిన గొప్ప మనసున్న నాయకుడు ముఖ్య మంత్రి కేసీఆర్ అని అన్నారు. సంగారెడ్డి జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ కుంచాల ప్రభాకర్, సర్పంచ్ సుశాంతి, ఉపసర్పంచ్



నవనీత రెడ్డి, బీఆర్ఎస్ రాష్ట్ర రాష్ట్ర నాయకులు వెంకటేశం గౌడ్, ప్రకాశం చారి, బీఆర్ఎస్ మం డలాధ్యక్షులు రాజేష్, మాజీ సర్పంచ్ రవీందర్, సురేందర్ రెడ్డి,ప్రభాకర్ ,మహేందర్, నరేష్, శ్రీనివాస్, నాగులు తదితరులు పాల్గొన్నారు.

నాందేడ్ సభకు బయలుదేరిన ఎమ్మెల్యేలు





నవతెలంగాణ-నారాయణఖేడ్, కల్హేర్

తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ జాతీయ అధ్యక్షులు కల్వకుంట్ల చంద్రశేఖర్ రావు మహా రాష్ట్రలోని నాందేడ్ పట్టణంలోని గురుగోవింద్ సింగ్ జి గ్రౌండ్‌లో నిర్వహిస్తున్న భారీ బహిరంగ సభకు నారాయణఖేడ్ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి, అందోల్ ఎమ్మెల్యే చంటి క్రాంతి కిరణ్ వెళ్లారు. వారితోపాటు పెద్ద ఎత్తున తరలివెళ్లారు.

ఖేడ్ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి నాయకత్వంలో సిర్గాపూర్, కల్హేర్, నిజాంపేట్ మండలాల నుంచి మండల బీఆర్ఎస్ మండలాధ్యక్షుల సంజీవ్ పాటిల్, రామ్‌సింగ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ భారీ బహిరంగ సభకు బయలుదేరి వెళ్లారు. ఈ సందర్భంగా సంజీవరావు పాటిల్ మాట్లాడుతూ.. ప్రత్యేక రాష్ట్ర ఏర్పాటే లక్ష్యంగా పురుడు పోసుకున్న తెలంగాణ రాష్ట్ర సమితి గమ్యాన్ని దాటుకుని ఇప్పుడు సరికొత్త లక్ష్యం వైపు బీఆర్ఎస్ అడుగులు వేస్తున్నదన్నారు. నాందేడ్ జిల్లా కేంద్రంలో గులాబీ అధినేత కేసీఆర్ సమావేశం చారిత్రక ఘట్టానికి శ్రీకారం చుట్టబోతున్నదన్నారు. తరలివెళ్లిన వారిలో బీఆంఎస్ గ్రామాధ్యక్షుడు యాదవరావు పాటిల్, కో ఆప్షన్ మెంబర్ బషీర్, మండల సోషల్ మీడియా అధ్యక్షుడు రమేష్ తదితరులున్నారు.

161 జాతీయ రహదారిపై అంతర్గత బ్రిడ్జిలను నిర్మించాలి

నవతెలంగాణ-పుల్కల్

పుల్కల్ ఉమ్మడి మండల పరిధిలో నుంచి వెళ్లిన 161 జాతీయ రహదారిపై సర్వీస్ రోడ్డుకు అంతర్గత బ్రిడ్జిలను నిర్మించాలని స్థానికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఆదివారం చౌటకూర్ మండల పరిధిలోని తాడ్దాన్‌పల్లి గ్రామ శివారులో ఉన్న రాయల్ కింగ్ ఫ్యామిలీ ధాబాలో పుల్కల్ ఉమ్మడి వాహనదారులు సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. రోడ్డు విస్తీర్ణ పనుల్లో విలువైన భూములను కోల్పోయామని.. కావున టోల్‌టాక్స్ యజమాన్యం వెంటనే చౌటకూర్ నుండి శివంపేట వరకు సర్వీస్ రోడ్డును వేయాలన్నారు. అలాగే సుల్తాన్పూర్, తాడ్దాన్‌పల్లి చౌరస్తా వద్ద, చక్రియాల గ్రామ చౌరస్తా వద్ద అండర్పాస్ బ్రిడ్జిలను వెంటనే ఏర్పాటు చేయాలన్నారు. అంతేకాకుండా పుల్కల్ ఉమ్మడి మండల వాహనదారులకు ఉచితంగా, ఎలాంటి రుసుము లేకుండా ఫ్రీ పాసులు ఇవ్వాలన్నారు. అలాగే రోడ్డు విస్తీర్ణ పనుల్లో భూములు కోల్పోయిన స్థానికులకు



టోల్ ప్లాజాలో ఉద్యోగ అవకాశాలు కల్పించాల న్నారు. లేనియెడల పుల్కల్ ఉమ్మడి మండల ప్రజలు టోల్‌ప్లాజా వద్ద భారీ ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. అన్ని పార్టీల రాజకీయ నాయకులు, యువజన సంఘాల నాయకులు, పుల్కల్ ఉమ్మడి మండల వాహనదారులు, ఆయా గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.

అసెంబ్లీ సమావేశల్లో సంగారెడ్డి సమస్యలపై చర్చ జరగాలి



- మియాపూర్ నుంచి సంగారెడ్డి వరకు మెట్రో రైలు సదుపాయం కల్పించాలి
- సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు

నవతెలంగాణ-సంగారెడ్డి

రాష్ట్ర ప్రభుత్వం బడ్జెట్ సమావేశాల సందర్భంగా సంగారెడ్డి జిల్లా సమస్యలపై ప్రధానంగా దృష్టి సారించాలని.. మియాపూర్ నుండి సంగారెడ్డి వరకు మెట్రో రైల్ ఏర్పాటు చేసి ఈ బడ్జెట్లో సరిపడా నిధులు కేటాయించి వెంటనే పనులు ప్రారంభించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి గొల్లపల్లి జయరాజు అన్నారు. ఆదివారం సంగారెడ్డిలో జరిగిన ముఖ్య కార్యకర్తలు సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. హైదరాబాద్ నుంచి జహీరాబాద్ ప్రాంతానికి ఎంఎంటీఎస్ రైలు సదుపాయం కల్పించాలని కోరారు. ఈ ప్రాంతంలో ప్రముఖ ఐఐటి విశ్వవిద్యాలయంతో పాటు ఇంజ నీరింగ్ కాలేజీలు ఉన్నాయన్నారు. ఈ తరుణంలో ఐటీ హబ్ ఏర్పాటు చేసి, జిల్లాలో మరిన్ని కంపెనీలను నెలకొల్పాలని డిమాండ్ చేశారు. నారాయణఖేడ్ ప్రాంతంలో సరైన పరిశ్రమలు లేక అక్కడి ప్రాంత ప్రజలు నేటికీ వలసలు వెళ్లి జీవనం గడుపుతున్నారన్నారు వెంటనే నారాయణఖేడ్ ప్రాం తానికి నూతన పరిశ్రమలు మంజూ రు చేసే విధంగా ఈ బడ్జెట్లో ప్రాతినిధ్యం ఉండాలని తెలిపారు. జిల్లాలో వేలాది మంది పేదలు ఇంటి స్థలం, ఇండ్లు లేక కిరాయిండ్లలో ఉం టూ తీవ్ర దుర్భరమైన జీవితాన్ని గడుపుతున్నారని ఇంటి స్థలాల కోసం, ఇంటి నిర్మాణాల కోసం సరిపడా బడ్జెట్లో నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఇంటి స్థలం ఉన్నవారికి ఎలాంటి షరతులు లేకుండా ఐదు లక్షలు చెల్లిం చేందుకు వెంటనే తగిన చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ప్రభు త్వాన్ని కోరారు. ఆసియా ఖండంలోని అతిపెద్ద పారిశ్రామిక ప్రాంతమైన పటాన్చెరు నియోజకవర్గంలో లక్షలాది మంది కార్మికులు ఉన్నారని.. వారికి సౌకర్యాలు, కనీస వేతనాలు అమలు కావడం లేదన్నారు. సంగారెడ్డి కేంద్రంగా నూతన ఈఎస్ఐ హాస్పిటల్‌ను మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. పార్టీ జిల్లా కార్యదర్శి అతిమేల మాణిక్, జిల్లా కమిటీ సభ్యులు ప్రవీణ్ కుమార్, యాదవరెడ్డి, నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

గ్రూప్-IV పరీక్షల కోసం ఉచిత కోచింగ్

నవతెలంగాణ-సంగారెడ్డి

అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో గ్రూప్-IV పరీక్షలకు కోసం ఉచిత కోచింగ్ ఇస్తున్నట్టు, అంబేద్కర్ స్టడీ సర్కిల్ అధ్యక్షులు రామారావు తెలిపారు. ఆదివారం విలేకర్ల సమావేశంలో అధ్యక్షులు రామారావు, పోటీ పరీక్షల సమన్వయ కన్వీనర్ కృష్ణ కుమార్ మాట్లాడుతూ.. గ్రూప్-IV పరీక్షల కోసం ఉచిత కోచింగ్ ఇవ్వాలని స్టడీ సర్కిల్ నిర్ణయించిందన్నారు. ఫిబ్రవరి 8 నుంచి 28 వరకు దరఖాస్తులు స్వీకరిస్తారన్నారు. కుల, ఆదాయ సర్టిఫికెట్స్‌తోపాటు ఆధార్ కార్డు, 3 పాస్ ఫోటోలు జతపరిచి స్టడీ సెంటర్లో దరఖాస్తులు అందజేయాలన్నారు. ఉదయం 10 గంటల నుండి సాయంత్రం 4 గంటల వరకు అందుబాటులో ఉంటామన్నారు. ఉచిత కోచింగ్ మార్చ్ 1 నుండి 60 రోజులు పాటు



ఇస్తారన్నారు. ఈ సమావేశంలో స్టడీ సర్కిల్ ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, గౌరవ సభ్యులు ఎస్ కోటయ్య, బి. నాగయ్య, మొగులయ్య, దుర్గయ్య సుధాకర్, అశోక్, దుర్గాప్రసాద్, మానిక్, ప్రభాకర్, ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఖేడ్ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలి


నవతెలంగాణ-నారాయణఖేడ్

నారాయణఖేడ్ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎం) ఖేడ్ ఏరియా కన్వీనర్ చిరంజీవి డిమాండ్ చేశారు. ఆదివారం నిర్వహించిన ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. నారాయణఖేడ్ మారుమూల ప్రాంతమైనప్పటికీ.. మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతం అన్నారు. ఈ ప్రాంతంలో పరిశ్రమలు ఏర్పాటు చేయ దానికి అనుకూలమైన వనరులు ఉన్నాయని.. ఈ ప్రాంతం పరిశ్రమల అభివృద్ధి దోహ దపడుతుందన్నారు. ఈ ప్రాంతం నుంచి అనేక రాష్ట్రాలకు వలస వెళ్లి జీవనాన్ని కొనసాగిస్తున్న ప్రజలకు ఈ ప్రాంతంలోనే



ఉపాధి కల్పించడానికి పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. లేని యెడల భవిష్యత్‌లో ఆందోళనలు తప్పవని హెచ్చరించారు. అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లో సందర్భంగా నారాయణఖేడ్ ప్రాంతానికి ప్రత్యేక నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఏరియా కమిటీ సభ్యులు నర్సింలు, సాయిలు, లక్ష్మణ్, అంజా గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

నవతెలంగాణ 3
మెదక్
సోమవారం 06 ఫిబ్రవరి 2023





చికెన్ ధరలు (కే.జీ)

ఫారంలెట్	- రూ. 87
రిటైల్	- రూ. 109
విత్‌స్కిన్	- రూ. 158
స్కిన్‌లెస్	- రూ. 180

బగలాముఖి విగ్రహ ప్రతిష్టకు రావాలని సీఎంకు ఆహ్వానం



నవతెలంగాణ-నర్సాపూర్

మండల కేంద్రమైన శివంపేటలో ఈ నెల 8, 9, 10వ తేదీలలో బగలాముఖి విగ్రహ ప్రతిష్ట మహోత్సవ కార్యక్రమం ఉన్నందున ఈ కార్యక్రమానికి రావాలని ఆదివారం స్థానిక ఎమ్మెల్యే మదన్ రెడ్డి ఆధ్వర్యంలో బగలాముఖి శక్తిపీఠ దేవాలయ ట్రస్ట్ చైర్మన్ వెంకటేశ్వర శర్మ, సభ్యులు హైకోర్టు న్యాయవాది శివ కుమార్ గౌడ్, శివంపేట జెడ్పీటీసీ పబ్బమహేష్ గుప్తా, టీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షులు రమణ గౌడ్, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్ రామ్ రెడ్డి లు హైదరాబాదులోని ప్రగతి భవన్‌కు వెళ్లి ముఖ్యమంత్రి కేసీఆర్‌ను ఆహ్వానించారు, అదేవిధంగా మంత్రులు మల్లారెడ్డి, గంగుల కమలాకర్, శ్రీనివాస్ గౌడ్‌లను సైతం ఆహ్వానించారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



నవతెలంగాణ-పెద్ద శంకరంపేట్

మండల కేంద్రలోని గాంధీ చౌక్ పరిధిలో డాక్టర్ గిరిజా షెట్కార్, స్టేట్ యూత్ ప్రధాన కార్యదర్శి రాకేష్ షెట్కార్ ఆధ్వర్యంలో ఆదివారం చిన్న పిల్లల ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. శివచంద్రా శెట్కర్ మెమోరియల్ ట్రస్ట్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. కార్యక్రమంలో భాగంగా చిన్నారులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందించారు పిల్లల ఎదుగుదల పట్ల తల్లి తండ్రులు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి వారికి వివరించారు. తన చదువు కున్న చదువు ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగ పడేలా చిన్న పిల్లల ఉచిత వైద్య శిబిరం నిర్వహించడం ఆనందంగా ఉందని డాక్టర్ గిరిజ శెట్కర్ అన్నారు. ఉచిత వైద్య శిబిర నిర్వాహకులకు మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాయిని మధు, యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు జైపాల్ గౌడ్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు గంగిరెడ్డి, ఎస్‌టీ సెల్ మండల అధ్యక్షులు గణేష్ రాథోడ్, ఓటీసీ సెల్ అధ్యక్షులు జనార్దన్, మూసాపేట్ సర్పంచ్ అంజిరెడ్డి తదితరులు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రామచందర్, మహిపాల్, గౌస్, రామదాస్, శివ, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

బంగారమ్మ జాతర ఉత్సవాల్లో మహిళా కమిషన్ చైర్‌పర్సన్ సునీత రెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

శివంపేట మండల పరిధిలోని తిమ్మాపూర్ గ్రామంలో జరుగుతున్న శ్రీ బంగారమ్మ తల్లి జాతర ఉత్సవాల్లో ఆదివారం రాష్ట్ర మహిళా కమిషన్ చైర్పర్సన్ సునీత రెడ్డి, ఎమ్మెల్యే మదన్ రెడ్డిలు పాల్గొని బంగారమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో వారి వెంట గ్రంథాలయ సంస్థ చైర్మన్ చంద్ర గౌడ్, మెదక్ జిల్లా ఎంపీపీల ఫోరం అధ్యక్షులు హరికృష్ణ, జెడ్పీటీసీ పబ్బ మహేష్ గుప్తా, పీఏసీఎస్ చైర్మన్ వెంకట్రామిరెడ్డి, బిఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షులు రమణ గౌడ్ మండల, మండల కోశాధికారి బండారి గంగాధర్, తిమ్మాపూర్ సర్పంచ్ అనసూయ అశోక్ గౌడ్, ఉప సర్పంచ్ సంధ్య వెంకటస్వామి, తదితరులు పాల్గొన్నారు.

పేదింటి వధువులకు పుస్తె మట్టెలు అందజేత



నవ తెలంగాణ-నర్సాపూర్

నర్సాపూర్ మండల పరిధిలోని చిన్న చింతకుంట గ్రామానికి చెందిన బేగరి ముత్యాలు దేవమ్మ దంపతుల కూతురు రమ్య వివాహానికి ఆదివారం శివంపేట మండల పరిధిలోని పిల్లుట్ల గ్రామానికి చెందిన ప్రముఖ సంఘ సేవకులు సేవా రత్న అవార్డు గ్రహీత బీఆర్ఎస్ పార్టీ మండల కోశాధికారి బండారి గంగాధర్ తన వంతు సాయంగా పుస్తె మెట్టెలు అందజేశారు. అదేవిధంగా మండల కేంద్రమైన కొడిపల్లి గ్రామానికి చెందిన శోభ కిష్టయ్య దంపతుల కూతురు మౌనిక వివాహానికి సైతం బండారి గంగాధర్ పుస్తె మట్టెలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట పెద్దపులి సతీష్ ఉన్నారు.

ఉత్తమ నంది అవార్డు



నవతెలంగాణ-నిజాంపేట

తెలంగాణ ఉద్యమ కళాకారుల ఐక్య వేదిక ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ హన్మకొండ, ఆర్ట్స్, సైన్స్ ఆడిటోరియంలో కళాకారుడు వల్లపు స్వామికి ఉత్తమ నంది అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మెదక్ జిల్లా నుంచి ఉద్యమ కళాకారుడైన తనకు ఉత్తమ నంది అవార్డు విమలక్క, దరువు అంజన్న, నేర్నాల కిషోర్ చేతుల మీదుగా ఈ అవార్డును అందుకోవడం జరిగిందన్నారు. తెలంగాణ ఉద్యమంలో తన ఆట పాటలతో ప్రజలను చైతన్య పరిచినందుకు ఉద్యమంలో ఏన్నో పాటలను పాడి, ఆడానన్నారు. ఎన్నో దుమ్ ధామ్ లు చేసిన తతను గుర్తించి ఈ అవార్డు ఇవ్వడం చాలా సంతోషంగా ఉందన్నారు

పోరాట ఫలితమే మధ్యాహ్న భోజన కార్మికులకు గౌరవ వేతనం పెంపు

సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు మహేందర్ రెడ్డి



నవతెలంగాణ-నర్సాపూర్

సీఐటీయూ పోరాట ఫలితమే మధ్యాహ్న భోజన కార్మికులకు ప్రభుత్వం గౌరవ వేతనం పెంచిందని సీఐటీయూ మెదక్ జిల్లా అధ్యక్షులు మహేందర్ రెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రమైన శివంపేటలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మధ్యాహ్న భోజన కార్మికులకు వెయ్యి రూపాయలు ఉన్న గౌరవ వేతనాన్ని మూడు వేలకు పెంచడం పట్ల సీఐటీయూ మెదక్ జిల్లా కమిటీ హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వేతనాల పెంపు కోసం సీఐటీయూ ఆధ్వర్యంలో అనేక పోరాటాలు చేయడం జరిగిందన్నారు. మధ్యాహ్న భోజన కార్మికులకు పెండింగ్ లో ఉన్న బిల్లులను ప్రభుత్వం వెంటనే చెల్లించాలని ఆయన డిమాండ్ చేశారు. ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెంబర్ 8ని స్వాగతిస్తూ రాబోవు కాలంలో మధ్యాహ్న భోజన కార్మికులు సమస్యల పరిష్కారం కోసం పోరాటాలకు సిద్ధం కావాలని మహేందర్ రెడ్డి కోరారు.

రాత్రిపూట కరెంటుతో రైతుల ఇబ్బందులు



- 24 గంటల విద్యుత్ ఏమైనట్టు
- ఉదయం పూట రావడంలేదు
- విద్యుత్ లేకపోవడంతో నీరుఅందని వైనం
- రైతుల ఆవేదన

నవతెలంగాణ/తూప్రాన్ రూరల్ (మనోహరాబాద్)

ఒక వైపు రైతులకు 24 గంటల ఉచిత విద్యుత్‌ను అందిస్తున్నట్టు రాష్ట్ర ప్రభుత్వం చెప్పుకుంటున్నప్పటికి ఆచరణలో మాత్రం రైతులకు విద్యుత్ అందక ఇబ్బందులు పడుతున్నారు. మరో వైపు రాష్ట్ర ముఖ్యమంత్రి కేసీఆర్ రాత్రి పూట వ్యవసాయానికి విద్యుత్ ఇవ్వడంతోనే రైతులు విద్యుత్ ప్రమాదాలకు గురౌతున్నారని, నిరంతరంగా విద్యుత్ ఇవ్వడంతో కేవలం మోటర్లను ఆన్‌చేసుకోవడంతోనే పంటలకు నీరందించవచ్చని దాంతో రైతులు విద్యుత్ ప్రమాదాలు జరగకుండా నివారణ జరుగుతుందని తెలియజేస్తున్నారు. అందుకుగాను రైతులకు నాణ్యమైన ఉచితంగా 24 గంటల త్రీఫేజ్ విద్యుత్‌ను రైతలకు అందిస్తున్నట్టు ఒక వైపు ప్రభుత్వం చెప్పుకుంటుంది. కానీ ఇరవై నాలుగు



గంటల మాట అటుంచి కనీసం 12 గంటలు కూడా నాణ్యమైన విద్యుత్ అందక రైతులు ఇబ్బందులకు గురవుతున్నారు. రాత్రి పూట విద్యుత్ ఇస్తుండడంతో తిరిగి పాత పద్దతిలోనే రైతులు పంట పొలాలకు వెల్లాల్సిన పరిస్థితి నెలకొంటుంది. రాత్రి సమయంలోనే రైతులకు త్రీఫేజ్ విద్యుత్ వస్తుండడంతో రైతులు రాత్రి సమయంలోనే పొలాల వద్ద కావలాకాయాల్సి వస్తుందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదంతా స్వయాన ముఖ్యమంత్రి నియోజకవర్గంలోనే ఈ పరస్థితి నెలకొందంటే, రాష్ట్రంలో పరిస్థితి ఏ విదంగా ఉందో అర్థం చేసుకోవచ్చు. ఒక వైపు రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు ఏ రాష్ట్రంలో కూడా ఇవ్వని విధంగా రైతులకు నాణ్యమైన త్రీఫేజ్ విద్యుత్‌ను అందిస్తుండడంతోనే రాష్ట్రంలో అధికంగా పంటలు పండి దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నామని చెప్పుకుంటుండగా కింది స్థాయికి వచ్చే సరికి రైతులకు మాత్రం విద్యుత్ అందజేయడంలో పూర్తిగా విఫలమవుతున్నారు.

పప్రభుత్వ ఆదేశాల మేరకు సరఫరా చేస్తున్నాం

విద్యుత్ ఏఈ కృష్ణ

ఈ విషయమై మనోహరాబాద్ విద్యుత్ ఏఈ కృష్ణని వివరణ కోరగా ప్రభుత్వ ఆదేశాల ప్రకారం రాత్రి 10 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మాత్రమై వ్యవసాయానికి నాణ్యమైన ఉచిత విద్యుత్‌ను సరఫరా చేస్తున్నామని అలాగే ఉదయం 6 గంటల నుండి రాత్రి పదిగంట వరకు మాత్రం సింగిల్ ఫేజ్ సరఫరా అవుతుందని కానీ విద్యుత్ లోడ్ లేని సమయంలో మాత్రం త్రీఫేజ్ వస్తుందని అది ఏ సమయంలో ఉంటుందో సరైన సమయం చెప్పలేమని తెలిపారు.

రాత్రి పూట విద్యుత్‌తో ఇబ్బందులు పడుతున్నాం

రైతు స్వామి (పోతారం)



రాత్రి పూట త్రీఫేజ్ ఇస్తుండడంతో చాలా ఇబ్బందులు పడుతున్నాం, పొలాల వద్దకు వెళ్లి అక్కడే ఉండాల్సిన పరిస్థితి నెలకొంది. రాత్రి సమయంలో కాకుండా పగటి పూట విద్యుత్‌ను అందజేయాలి

పగటి పూట విద్యుత్ ఇస్తేనే బాగుంటది

రైతు సాయిలు (పోతారం)



ర4వఆశ్రీనతి పూట కాకుండా పగటి పూటను వ్యవసాయానికి త్రీఫేజ్ విద్యుత్ ఇస్తేనే బాగుంటది, రాత్రి పూట ఇస్తుండడంతో పంటల కోసం ఇబ్బందులు పడుతున్నాం, అందులో వరి నాట్లు పడినసమయం కావడంతో నీరు చాలా ముఖ్యం ఇదే రీతిలో విద్యుత్ వస్తే పంటలు నష్టపోయే పరిస్థితి ఉంటుంది. రాత్రి సమయంలో కాకుండా పగటి పూటనే విద్యుత్ ఇవ్వాలి.

జంప్ జిలానీలు!

- జిల్లాలో మారుతున్న రాజకీయ పరిణామాలు
- ఎన్నికల నేపథ్యంలో జోరుగా గోడ దూకుడు'
- గులాబీలో మొదలైన ముసలం
- కాంగ్రెస్‌లో కొలిక్కిరాని నాయకత్వం

నవతెలంగాణ- మెదక్ రూరల్:

ఓ గ్రామంలోని చావిడి దగ్గర జరుగుతున్న సంభాషణ....

అవునూరా మామా మొన్న గా మల్లిగాడు (పేర్లు నామమాత్రంగా. పెట్టడం జరిగింది చంద్రన్న(టీఆర్ఎస్ పార్టీ నేత)తో పాటు బాగా తిరిగిండు కదారా..! గిప్పుడు గా రాజిరెడ్డి (కాంగ్రెస్ పార్టీ నేత)తో కలిసి అన్ని మీటింగ్లకు పోతుండు. అవునురా నువ్వు జెప్పింది నిజమే...! మొన్నటిదాకా ఆ రాజిరెడ్డిని పట్టించుకొని మల్లిగాడు ఇప్పుడు బాగా తిరుగుతుండు. అంతేగాదురా కాంగ్రెస్సోల్లా గురించి చెబుతుండ్రు. చెబుతాదురా... ఎందుకంటే ఎలక్షలోస్తున్నాయి గదారా..! అవునురా ఇగా ఎవళ్లు ఎప్పుడు ఏ పార్టీలో ఉండేది తెల్వదురా...





ఎమ్మెల్యే ఎన్నికలకు ఇంకా దాదాపు సంవత్సరం సమయం ఉన్న జిల్లాలో మాత్రం రాజకీయం వెడెక్కిందనే చెప్పాలి. ఇప్పటికే టీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీల నాయకులు.. కార్యకర్తలు వారికి ఏ పార్టీలో పాదాన్యత ఉందో పార్టీలో చేరుతున్నారు. దీనితో పాటు గతంలో పలు పార్టీల నుంచి టిక్కెట్లు రానీ అభ్యర్థులు ఇప్పుడు వారికి ఏ పార్టీ టిక్కెట్ ఇస్తే ఆ పార్టీలోకి వెళ్లేందుకు సంసిద్ధంగా ఉన్నారు. అంతేకాకుండా వారి బలాన్ని సైతం ప్రదర్శించేందుకు తమవెంట ఉన్న నాయకులు, కార్యకర్తలను కంటికి రెప్పల్లా కాపాడుకుంటునే.. మరోవైపు ఇతర పార్టీల నాయకులు, కార్యకర్తలను తమవైపునకు వచ్చేలా పలు మంతనాలు చేస్తున్నారు.

టిక్కెట్ అశావాహులు సైతం

గత ఎన్నికల్లో పలు పార్టీల నుంచి ఎంతో మంది నాయకులు ఎమ్మెల్యే టికెట్‌ను ఆశించిన వారికి నిరాశే మిగిలింది. ఈ నేపథ్యంలో కొందరూ నాయకులు పార్టీలు మారడం.. ఇండిపెండెంట్లుగా పోటీ చేసిన సంఘటనలు సైతం కొక్కొలల్లు. కాగా గత ఎన్నికల్లో టిక్కెట్ రాని అభ్యర్థులు వచ్చే ఎమ్మెల్యే ఎన్నికల్లో టిక్కెట్ల కోసం భారీగానే శ్రమిస్తున్నారని చెప్పాలి. ఓ వైపు టిక్కెట్ కోసం భారీఎత్తున ప్రయత్నాలు చేస్తూనే ... మరోవైపు పార్టీ ఫండ్, కార్యకర్తలకు డబ్బు రూపేనా బాగానే పలుకుబడి చూపిస్తున్నారని చెప్పుకోవాలి. ఈ నేపథ్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలను నమ్ముకోవడమటుంచి.. తమను నమ్మి ఎంత మంది నాయకులు, కార్యకర్తలు ఉన్నారో ఇప్పటి నుంచే లెక్కలు వేసుకుంటున్నారు.

ఈ సారి సైతం టికెట్ కోసం భారీగా మంతనాలు

గత ఎన్నికల్లో ఎమ్మెల్యే టిక్కెట్ వచ్చిన పలువురు మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్యేలు ఈ సారి సైతం ఆయా పార్టీల నుంచి తమకే టిక్కెట్లు వచ్చేందుకు పెద్దఎత్తున మంతనాలు చేస్తున్నారనే చెప్పాలి. జిల్లాలోని కొంతమంది ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజలు అంతగా సంతృప్తిగా లేకపోవడంతో అటు ప్రజల్ని... ఇటు పార్టీల నమ్మకం కోసం భాగానే శ్రమిస్తున్నారని పలువురు రాజకీయ విశ్లేషకుల అభిప్రాయం.

బీజేపీలో టిక్కెట్ కోసం ఎదురుచూపులు..

బీజేపీ లో ఎమ్మెల్యే టిక్కెట్ కోసం ఆశావాహులు ఎదురుచూస్తున్నారు. ఇప్పటి నుంచే ఎవరికి వారు తమ వంతు ప్రయత్నాలు చేస్తున్నారు. తాళ్ళపల్లి రాజశేఖర్, గడ్డం శ్రీనివాస్‌తో పాటు మరో ఇద్దరు టికెట్ ఆశిస్తూ అధిష్టానం మెప్పు కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. ఎవరికి వారు ప్రజల్లోకి వెళ్తూ క్యాడర్‌ను పెంచుకునే పనిలో నిమగ్నమయ్యారు.

నాయకత్వం లేని కాంగ్రెస్...

ఇక కాంగ్రెస్ పార్టీ విషయానికొస్తే... గత ఎమ్మెల్యే ఎన్నికల్లో చివరి నిమిషం వరకు మాజీ ఎమ్మెల్యే శశిధర్ రెడ్డికి పార్టీ బి ఫాం వస్తుందని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు అనుకున్నారు. కానీ శశిధర్ రెడ్డి తమ్ముడు ఉపేందర్ రెడ్డికి కాంగ్రెస్ పార్టీ బి ఫాం ఇచ్చింది. దీంతో జెడ్పీటీసీలు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లతో పాటు ముఖ్య నాయకులు శశిధర్ రెడ్డికి మద్దతు ఇవ్వడంతో ఒకానొక సమయంలో శశిధర్ రెడ్డి ఇండిపెండెంట్‌గా పోటీ చేసేందుకు సిద్దమయ్యారు. కానీ పార్టీ పెద్దలు శశిధర్ రెడ్డితో పలు మంతనాలు జరిపి పార్టీలో తగిన ప్రాధాన్యం ఇస్తామని హామీ ఇవ్వడంతో శశిధర్ రెడ్డి పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థికి మద్దతు ఇచ్చారు. అంతేకాకుండా కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులైనా కంఠారెడ్డి తిరుపతి రెడ్డి, మ్యాడం బాలకృష్ణలతో సహా పలువురు ఎమ్మెల్యే టిక్కెట్‌ను ఆశించి.. నిరాశ చెందిన వారే. ఎన్నికల్లో పార్టీ గెలుపొందకపోవడంతో కాంగ్రెస్ పార్టీలో ఎవరికి వారే పలు కార్యక్రమాలు చేసుకుంటూ వెళ్తున్నారు. దీంతో కాంగ్రెస్ పార్టీ తీరు ఎవరికీ వారే యమునా తీరే అన్న చందంగా మారింది.

ఎవరూ ఎటువైపు...

మెదక్ జిల్లాలోని అన్ని నియోజకవర్గాల ఎమ్మెల్యేలు టీఆర్ఎస్ పార్టీకి చెందిన వారే... కాగా ఇందులో కొంతమంది ఎమ్మెల్యేల పనితీరుపై ప్రజలు అసంతృప్తిగా ఉండడంతో ఈ సారి పార్టీలో ఎమ్మెల్యే టిక్కెట్ రాదని ఆ పార్టీకి చెందిన పలువురు ముఖ్య నాయకులు మాట్లాడుకోవడం గమనార్హం. ఈ నేపథ్యంలో కొందరు ఎమ్మెల్యేలు తమకు టిక్కెట్ రాకపోతే ఏ పార్టీలోకి వెళ్లడానికైనా సిద్ధంగానే ఉన్నారని చెప్పుకోవచ్చు.

నిబంధనలకు విరుద్ధంగా ఆర్‌ఎంసి ప్లాంట్



నవతెలంగాణ-మెదక్ రూరల్

మెదక్ పట్టణంలో రెండు, మూడవ వార్డు సమీపంలో నిబంధనలకు విరుద్ధంగా డాంబర్, ఆర్‌ఎంసీ ప్లాంట్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ ప్లాంట్ ఏర్పడడం వల్ల డాంబర్ వాసనతో దుమ్ము ధూళితో అనారోగ్యం పాలవుతున్నామని పట్టణంలోని 2,3వ వార్డు ప్రజలు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రజల ప్రాణాలంటే అధికారులకు లెక్క లేకుండా పోయిందన్నారు. అసలు మెదక్ పట్టణ సమీప ప్రాంతంలో ఈ ప్లాంట్ కు ఎలా అనుమతి ఇచ్చారని ప్రజలు నిలదీస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్, మున్సిపల్ కమిషనర్, సంబంధిత అధికారులు స్పందించి వెంటనే ఆ ప్లాంట్ నిర్మాణ పనులను నిలిపివేయాలని ఆయా కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.

మాణిక్ రావు ఠాక్రేను కలిసిన ఆంజనేయులు గౌడ్



నవతెలంగాణ-నర్సాపూర్

హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్ రావు ఠాక్రేను ఆదివారం కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు ఆంజనేయులు గౌడ్ కలిసి శాలువాతో సన్మానం చేశారు. అనంతరం నర్సాపూర్ నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ పరిస్థితులను, హత్ సే హాత్ జూడో యాత్ర కార్యక్రమం వివరాలను మాణిక్ రావు ఠాక్రేకు, ఆంజనేయులు గౌడ్ వివరించారు.

రోడ్డు ప్రమాదంలో కానిస్టేబుల్ మృతి



నవతెలంగాణ-కొల్చారం

రోడ్డు ప్రమాదంలో ఓ కానిస్టేబుల్ మృతి చెందిన ఘటన కొల్చారం పోలీస్ స్టేషన్ పరిధిలోని మెదక్- హైదరాబాద్ జాతీయ రహదారి పారాబైల్డ్ రైస్ మిల్ మూలమలుపు వద్ద ఆదివారం చోటు చేసుకుంది. ప్రత్యక్ష సాక్షులు, పోలీసుల కథనం ప్రకాంం వివరాలు ఇలా ఉన్నాయి. హైదరాబాద్ కమిషనరేట్ యూసుఫ్ గూడ టీఎస్ఎస్ పి ఫస్ట్ బెటాలియన్‌కు చెందిన కానిస్టేబుల్ బి.నాగరాజు మెదక్ నుంచి హైదరాబాద్ వైపు బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న కారు ఆకస్మాత్తుగా ఢీ కొట్టడంతో నాగరాజుకు తీవ్ర గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న ఏఎస్ఐ తారాసింగ్ ఘటన స్థలికి చేరుకుని క్షతగాత్రున్ని 108లో మెదక్ ఏరియా ఆసుపత్రికి తరలించగా.. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. ఈ మేరకు కొల్చారం పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతునికి ఇద్దరు కూతుళ్లు, ఓ కుమారుడు ఉన్నారు.

అంబేద్కర్ చూపిన మార్గంలో విద్యార్థులు నడవాలి

ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్



నవతెలంగాణ-సిద్దిపేట

డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నప్పటికీ ప్రపంచంలోనే ఒక మహోన్నత వ్యక్తిగా నిలిచారని, విద్యార్థులు కూడా ఆయన మార్గంలోనే నడిచి ఉన్నత స్థాయికి ఎదగాలని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ హుస్సేన్ అన్నారు. ఆదివారం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీ సార్వత్రిక విశ్వవిద్యాలయ 40 వసంతాల వేడుకలు పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ కే భవాని అధ్యక్షతన జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అంబేద్కర్ గురించి వివరించారు. రీజనల్ కోఆర్డినేటర్ డాక్టర్ కే భవాని మాట్లాడుతూ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విశ్వవిద్యాలయం విద్యార్థులకు ఒక వరం లాంటిదన్నారు. ఇక్కడి అవకాశాలను అందిపుచ్చుకొని మంచి స్థాయికి ఎదగాలన్నారు. సీనియర్ కౌన్సిలర్‌లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్‌లు బాలయ్య, అంజిరెడ్డి, విష్ణుమూర్తి, శ్రీకాంత్, శ్రీనివాస్, వేణు, తిరుపతి, విద్యార్థులు, కార్యాలయ సిబ్బంది ఎల్లం, రాజు, నరేందర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలి



నవతెలంగాణ-మర్కుక్

గ్రామీణ క్రీడాకారులు జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణించాలని వర్ధరాజ్ పూర్ మాజీ సర్పంచ్, మండల కోఅప్షన్ సభ్యులు లక్కాకుల సహేర నరేష్, సర్పంచ్ అప్పాల ప్రవీణ్ కుమార్ అన్నారు. ఆదివారం మండల పరిధిలోని వర్ధరాజ్ పూర్‌లో యువతకు గ్రామ స్థాయి క్రికెట్ టోర్నమెంట్‌ను కిట్స్, క్రీడాసామాగ్రిని అందజేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ యువత క్రీడలతో పాటు అన్ని రంగాలలో రాణించాలన్నారు. గ్రామీణ యువతకు అవకాశాలు కల్పిస్తే జిల్లా, రాష్ట్ర స్థాయిలో రాణిస్తారన్నారు. యువతకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని తెలిపారు. అనంతరం గెలుపొందిన ప్రథమ జట్టుకు స్వామి, ద్వితీయ జట్లుకు కిషన్ నగదును అందజేశారు. సింగాని భాస్కర్ జ్ఞాపకార్థం వారి సోదరుడు సింగని బాలరాజు క్రీడాకారులకు టీషర్టులను అందజేశారు. ఆటలో పాల్గొన్న క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు అయిలయ్య, రాంరెడ్డి, శ్రీపతి రాజు, అమర్, నాగులు, మహేష్, తదితరులున్నారు.



కంటి చీకట్లను దూరం చేసేందుకే కంటి వెలుగు

ఎంపీటీసి ఫోరం మర్కుక్ మండలాధ్యక్షులు రాజమైన కృష్ణ యాదవ్

నవతెలంగాణ-మర్కుక్



తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న రెండవ విడత కంటి వెలుగు పథకం పేద ప్రజల కంటి చీకట్లను దూరం చేసేందుకేనని ఎంపీటీసిల ఫోరం మర్కుక్ మండలాధ్యక్షులు రాజమైన కృష్ణ యాదవ్ అన్నారు. ఆదివారం 'నవతెలంగాణ'తో మాట్లాడుతూ కంటి వెలుగు పథకం దేశంలోనే ఎక్కడ లేదని, సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రంలో ప్రవేశ పెట్టారన్నారు. మండలంలోని అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆరోగ్య సిబ్బంది, కంటి వెలుగు కార్యక్రమంపై ప్రచారం చేయాలని సూచించారు. అంధత్వాన్ని దూరం చేయడమే లక్ష్యంగా కంటి వెలుగు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని వెల్లడించారు. ప్రజలందరూ కంటి వెలుగు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

క్షత్రియ రామజోగి అసోసియేషన్ క్యాలెండర్ ఆవిష్కరణ

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ సీఎం క్యాంప్ కార్యాలయంలో ఆదివారం ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, రామజోగి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి రామ్ ప్రసాద్ ఆధ్వర్యంలో తెలంగాణ క్షత్రియ రామజోగి అసోసియేషన్ నూతన సంవత్సర క్యాలెండర్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నేతృత్వంలో తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత ప్రతి కులానికి ప్రాధాన్యత ఇస్తున్నారన్నారు. అందులో భాగంగా తెలంగాణ క్షత్రియ రామ జోగి కులం సమాజానికి అన్ని విధాలా అండగా ఉంటుందన్నారు. నూతన క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్న క్షత్రియ రామజోగి సమాజానికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్ ఉప్పల మెట్టయ్య, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు నవాజ్ మీరా, తెలంగాణ క్షత్రియ రామజోగి అసోసియేషన్ సిద్దిపేట జిల్లా అధ్యక్షులు గుజ్జేటి వెంకటేశం, ఉపాధ్యక్షులు గుజ్జేటి శ్రీనివాస్, సభ్యులు రామచంద్రం, కిరణ్, రాజు, భారతి, లక్ష్మి, సుమలత, వసంత పాల్గొన్నారు.

అనాథ వృద్ధులకు సహకారం

నవతెలంగాణ-సిద్దిపేట



పట్టణంలోని నైట్ షెల్టర్, అనాథ వృద్ధుల ఆశ్రమం, లార్డు స్వచ్ఛంద సంస్థను సందర్శించి అక్కడి వారి బాధలు తెలుసుకొని దాతలతో కలిసి సహాయం చేసినట్లు బీజేపీ జిల్లా మహిళా మోర్చా అధ్యక్షురాలు గాడిపల్లి అరుణ రెడ్డి తెలిపారు. ఆదివారం ఆర్.ఓ వాటర్ ఫిల్టర్, 3 బెంచీలు, 6 కుర్చీలు, 1 ఫ్యాను అందజేసి, అనంతరం వారికి భోజనాలు ఏర్పాటు చేసి, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గాడిపల్లి భాస్కర్ రెడ్డి, వర్షిని రెడ్డి, అభినవ్ రెడ్డి, దాతలు పాల్గొన్నారు.

క్రీడలు సమిష్టి కృషికి సోపానాలు

సీఐ జానకి రాంరెడ్డి



నవతెలంగాణ-బెజ్జంకి

క్రీడల్లో గెలుపోటములు సహజమని..క్రీడా స్ఫూర్తిని చాటడానికి జట్టులోని సభ్యుల సమిష్టి కృషికి సోపానాలుగా నిలుస్తాయని సీఐ జానకి రాంరెడ్డి అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో బెజ్జంకి క్రికెట్ అసోసియేషన్ అధ్వర్యంలో నిర్వహిస్తున్న క్రికెట్ క్రీడా పోటీల్లో పోలీస్, ప్రెస్, పోలీటీకల్ జట్లు తలపడ్డాయి. పోలీటీకల్ జట్టుపై పోలీస్, ప్రెస్ జట్టు 25 పరుగులతో గెలుపొందగా ఎస్ఐ నరేశ్ రెడ్డి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ గా ఎంపికయ్యారు. నిర్వహకులతో కలిసి సీఐ జానకి రాంరెడ్డి ఎస్ఐకి మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డ్ అందజేశారు. అయా పార్టీల నాయకులు, నిర్వహకులు పాల్గొన్నారు.

పంటలు ఆకుపచ్చగా ఉండాలన్నదే సీఎం లక్ష్యం

ఎఫ్‌డీసీ చైర్మన్ ప్రతాప్ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



పంటలన్ని ఆకుపచ్చగా ఉండాలని, రైతు కళ్ళల్లో సంతోషం చూడాలని ఎఫ్‌డీసీ చైర్మన్ ఒంటేరు ప్రతాపరెడ్డి అన్నారు. ఆదివారం గజ్వేల్ మండలంలోని బూరుగుపల్లి గ్రామంలో కూడవెల్లి వాగులో చెక్ డాం వద్ద గంగమ్మ తల్లికి ప్రత్యేకమైన పూజలు నిర్వహించారు. తెలంగాణ రాష్ట్ర రైతుల అవసరాల దృష్ట్యా కాళేశ్వరం, కొండపోచమ్మ సాగర్, మల్లన్న జలాశయం నుంచి నీళ్లు గజ్వేల్ ప్రాంతంలో చేబర్తి చెరువు నుంచి ప్రారంభమై మర్కుక్, జగదేపూర్, గజ్వేల్ మండలంలోని కొడకండ్ల బూరుగుపల్లి సింగాటం తదితర గ్రామాలకు చేరుకుంటున్నా యన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని భారతదేశానికి మోడల్‌గా దిద్దడమే కేసీఆర్ లక్ష్యమన్నారు. భారతదేశానికి కేసీఆర్ నాయకత్వం అవసరమన్నారు. కేంద్రంలోని నరేంద్ర మోడీ సర్కార్‌ను రాబోయే రోజులలో గద్దె దించడం ఖాయమన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వంటేరు విజయవర్ధన్ రెడ్డి, మండల కో ఆప్షన్ అబ్దుల్, రాజు, చంద్ర గౌడ్, స్వామి, భాస్కర్ రెడ్డి, భరత్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వాహద్, సత్తయ్య బీఆర్ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు ఉన్నారు.

పాఠశాలకు కంప్యూటర్ వితరణ

నవతెలంగాణ-మద్దూరు



మండలంలోని లద్నూర్ జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో1991-92 సంవత్సరంలో 10వ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థులు పాఠశాలకు కంప్యూటర్ కొనుగోలు చేసి పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఆరే లక్ష్మీనరసయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు లక్ష్మీనరసయ్య మాట్లాడుతూ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ప్రస్తుతం చదువుతున్న విద్యార్థుల కోసం కంప్యూటర్‌ను వితరణగా అందించడం అభినందనీయమని ఆయన తెలిపారు. విద్యార్థులు కంప్యూటర్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో ఎస్ఎంసి చైర్మన్ పాకాల జయ, పూర్వ విద్యార్థులు చిక్కుడు మహేందర్, బొడిగం భూపాల్ రెడ్డి, మాటగోడు నరేందర్, అన్నోజు కనకాచారి, ఎండి రెహమాన్, దాసరి ప్రశాంత్, దాసరి మేఘనాథ్ , తదితరులు పాల్గొన్నారు

వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో సహకారం

నవతెలంగాణ-సిద్దిపేట



వాసవి వనిత క్లబ్ ఆధ్వర్యంలో శీల శ్రీనివాస బర్త్ డే సందర్భంగా లచ్చ పేట గ్రామానికి చెందిన మౌనిక వివాహ నిమిత్తం స్టీల్ సామాగ్రిని, కాళ్లు కడిగే చెంబు తాంబాలం, చీర, గాజులు పేదవధువుకి అందజేశామని వనిత క్లబ్అధ్యక్షురాలు తొడుపునూరి కృష్ణవేణి తెలిపారు. వనిత క్లబ్ జోన్ చైర్మన్ సోమ వనజ, క్లబ్ సభ్యులు ఆత్మ రాములు, బాల శేఖరం పాల్గొన్నారు.

మైసంపల్లి పెద్దమ్మ తల్లికీ బోనాలు

నవతెలంగాణ-నంగునూరు



నంగునూరు మండలంలోని మైసంపల్లి గ్రామంలో పెద్దమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాల్లో భాగంగా ఆదివారం ఉదయం, సాయంత్రం గ్రామ దేవతలకు మహిళలు బోనాల పండుగ నిర్వహించారు.ఈ నెల 2న ప్రారంభమైన మహోత్సవాలు 7 వరకు నిర్వహించ నున్నట్లు గ్రామ ముదిరాజ్ సంఘం నాయకులు తెలిపారు. పోచమ్మ ఎల్లమ్మకు పెద్ద ఎత్తున బోనాల పండుగను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ జాప అరుణా రాంచంద్రారెడ్డి, మాజీ ఎంపీపీ జాప శ్రీకాంత్ రెడ్డి, గ్రామ సర్పంచ్ గంధమాల స్వరూప రాజెల్లయ్య, ఉపసర్పంచ్ పిల్లి స్వప్న రవీందర్, గ్రామ ముదిరాజ్ సంఘం అధ్యక్షుడు చిక్కుడు యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకనుగుణంగా ఆర్టీసీ బస్సు సౌకర్యం

నవతెలంగాణ-నంగునూరు : సిద్దిపేట నుంచి నంగునూరు మండలంలోని గ్రామాలకు సోమవారం నుంచి బస్సు సౌకర్యం కల్పించనున్నామని సిద్దిపేట ఆర్టీసీ డిపో మేనేజర్ వై.సుఖేందర్ రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉదయం 7-30 గంటలకు ఘన్‌పూర్ నుంచి గట్లమల్యాల మోడల్ స్కూల్, సాయంత్రం 6-15 కు గట్ల మల్యాల మోడల్ స్కూల్ నుంచి ఘనపూర్ వరకు బస్సు నడుస్తోందన్నారు. అదేవిధంగా ఉదయం 8-30 గంటలకు మగ్దుంపూర్ నుంచి సిద్దిపేట వరకు, సాయంత్రం 6:10 గంటలకు సిద్దిపేట నుంచి మగ్దూంపూర్ ఖాత వరకు బస్సు సౌకర్యం కల్పించనున్నా మన్నారు. ప్రయాణికులు, విద్యార్థులు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకొని ఆర్టీసీ బస్సులోనే ప్రయాణించాలని తెలిపారు. ప్రైవేటు వాహనాల్లో ప్రయాణించి ప్రమాదాలు కొని తెచ్చుకోవద్దని కోరారు.

మాంకాలమ్మ దేవాలయ గడప ప్రతిష్ట

నవతెలంగాణ-కొండపాక : కొండపాక మండలం బందారం గ్రామంలో మహంకాళమ్మ దేవాలయ పునర్నిర్మాణ పనులు జరుగుతున్నాయి. అందులో భాగంగా ఆదివారం వేద బ్రాహ్మణులచే ఆలయ ప్రధాన ద్వారా గడప ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించారు . బందారం గ్రామంలో సుమారు 1000 సంవత్సరాల క్రితం నిర్మితమైన మహంకాళి అమ్మ దేవాలయం శిథిలావస్థకు చేరుకోవడంతో గ్రామానికి చెందిన రెడ్డి కులస్తులు ఏకమై ఆలయాన్ని పునర్ నిర్మించారు. నిమ్మ దుర్గారెడ్డి. మల్లారెడ్డి. యాదవ రెడ్డి. గాల్ రెడ్డి. శ్రీనివాస్ రెడ్డి. ప్రతాపరెడ్డి. గండె మహేష్ .బిక్షపతి. మోహన్ రెడ్డి. కర్ణాకర్ రెడ్డి. రమేష్. యాదగిరి, గంగాధర్ శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రైతన్నల ఆశలు ఆవిరేనా?

- తగ్గిన పత్తి ధర
- తెగుళ్ల బారిన పడి దెబ్బతింటున్న వరి పంట
- గతేడాది పత్తి ధర రూ.10 వేల పైనే..
- ఈసారి రూ.7,550
- రైతులకు గిట్టుబాటుకాక దయనీయ పరిస్థితి



కాయలున్న చెట్టుకే రాయి దెబ్బలన్నట్టుగా ఉంది నేడు దేశానికి అన్నం పెట్టే రైతన్న పరిస్థితి. అరకొరగా వచ్చిన పత్తి పంట దిగుబడికి గిట్టుబాటు ధరలేక.. విక్రయించుకోలేని పరిస్థితి ఒక వైపు.. మొగిపురుగు తెగుళ్లు సోకి వరి పంట పొలాలు నశించిపోతున్న దుస్థితి మరోక వైపు నెలకొనడంతో రైతన్నల ఆశలు ఆవిరవుతున్నాయి. ఆరుగాలం కష్టపడి పెట్టుబడులు పెట్టి అరకొరగా వచ్చిన పత్తి దిగుబడికి ధర కూడా గణనీయంగా తగ్గింది. దీంతో పండిన పత్తి దిగుబడిని విక్రయించుకోలేక ఇళ్లల్లో నిల్వ చేసుకున్నారు. మార్కెట్‌లో పత్తికి సరైన ప్రాధాన్యత లేకపోవడంతో వ్యాపారులు ముఖం చాటేశారు. పెట్టుబడి కోసం తెచ్చిన అప్పులకు వడ్డీలు పెరిగిపోతుండడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతున్నారు. రెండేళ్లుగా పత్తికి ప్రాధాన్యత పెరడగం, భారీ ధరలు పలకడంతో మండలంలో పత్తిని అధికంగా సాగు చేశారు. గతేడాది దిగుబడి తక్కువగా ఉన్నా.. ధర ఉండడంతో ఆ ఆశతో ఈసారి పత్తిని సాగు చేశారు. గత ఏడాది క్వింటాల్‌కు రూ.10 వేలకుపైగా పలికిన ధర.. ఈసారి రూ.7,550లకు పడిపోయింది. దీంతో ఈ ఏడాది పత్తి సాగు కలిసిరాలేదని రైతులు ఆవేదన చెందుతున్నారు.

నవతెలంగాణ-బెజ్జంకి

మండలంలో సుమారు 7 వేల ఎకరాల్లో పత్తి, 10 వేల ఎకరాల్లో రైతులు వరి పంట సాగు చేశారు. అధిక వర్షాలు, వాతావరణ పరిస్థితులు, నకిలీ విత్తనాలు, తెగుళ్లు తదితర కారణాలతో పత్తి దిగుబడి గణనీయంగా తగ్గింది. ఎకరాకు 8 నుంచి 10 క్వింటాళ్ల దిగుబడి రావాల్సి ఉండగా ఈసారి కేవలం రెండు మూడు క్వింటాళ్లకు పరిమితమైంది. ప్రస్తుత ధరలను బట్టి ఎకరాకు రూ.12 వేలు నుంచి రూ.15 వేలు మాత్రమే వచ్చేలా ఉంది. పెట్టుబడి మాత్రం ఎకరాకు మెట్ట భూమిలో రూ.30 వేలు, తడి భూముల్లో రూ.40 వేలు వరకు ఖర్చు చేశామని రైతులు చెబుతున్నారు.

తగ్గిన కొనుగోళ్లు

మండలంలోని పత్తిని సాగు చేసిన రైతులు దిగుబడిని విక్రయించడానికి మండలంలోని పత్తి మిల్లులకు తరలిస్తుంటారు. మార్కెట్ అనుసరించి ఇక్కడ పత్తి ధరల నిర్ణయం జరుగుతుంది. ఈ ఏడాది ధరలు తక్కువగా ఉండడంతో వ్యాపారులు నాణ్యత పేరును ఆసరాగా చేసుకుని ధరలను మరింత తగ్గిస్తున్నారని వినికిడి. ధర నచ్చకపోతే దిగుబడిని వెనక్కి తీసుకువెళ్లాలని వ్యాపారస్తులు రైతులకు చెప్పేస్తున్నారని... దీంతో మిల్లు వరకూ తీసుకువెళ్లిన పత్తిని రైతులు ఏదో ఒక ధరకు విక్రయించి వస్తున్నారని సమాచారం.

ఇళ్లలోనే పత్తి నిల్వలు

పెట్టుబడులు కూడా రాని పరిస్థితి నెలకొనడంతో రైతులు పత్తి దిగుబడులను ఇళ్లకు చేర్చి నిల్వ చేశారు. కోత కోతకూ ఇళ్లలో పత్తి దిగుబడి నిల్వ పెరుగుతోందని, గిట్టుబాటు ధర మాత్రం లభించకపోవడంతో తాము నష్టపోయే పరిస్థితి ఉందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ధర పెరుగుతోందని ఎదురుచూపులు చూసిన రైతులు అప్పుల బాధలు తాళలేక కొందరు విక్రయిస్తున్నారని తెలుపున్నారు. భవిష్యత్తులో ధర పెరుగుతుందని భావిస్తూ మరి కొందరు రైతులు గంపెడాశతో పత్తి దిగుబడిని ఇళ్లల్లో నిల్వ చేస్తున్నారు.

తెగుళ్ల బారిన వరిపంట పొలాలు

యాసంగిలో మండలంలో వరిపంట సాగు చేసిన రైతులు దిక్కుతోచని స్థితిని ఎదుర్కొంటున్నారు. ముందస్తుగా వరినాటు చేశామని ఊపిరిపిల్చుకుంటున్న క్రమంలో మొగిపురుగు తెగులుబారిన పడి నశించిపోతున్నాయి. యాసంగిలో వరి పంటకు తెగుళ్లు సోకడంతో ఆశించిన దిగుబడి కలగానే ఉంటుందని పలువురు రైతులు అవేదన వ్యక్తం చేస్తున్నారు.

పత్తి, వరి పంటలు రైతులకు మొండిచెయ్యి చూపుతున్నాయని, ప్రభుత్వం ఆదుకోవాలని, లేనిపక్షంలో దుర్భరస్థితి ఎదుర్కొంటారని రైతులు దిగాలు చెందుతున్నారు.

మిల్లుల నిర్వహణ భారం

పత్తి పంటలపై పురుగు ఆశించడం, విత్తనాల్లో నాణ్యత లోపం వల్ల నూనె శాతం తగ్గడంతో పత్తి ధరలపై ప్రభావం చూపుతోందని పత్తి మిల్లుల యజమానులు చెబుతున్నారు. మార్కెట్‌లో పత్తి ధర ప్రభావం వల్ల రైతులు వారి ఇళ్లలోనే పత్తి దిగుబడిని నిల్వ చేసుకుంటున్నారు. పత్తి కొనుగోళ్లు లేక మిల్లుల వద్ద వేచి చూసుకుంటూ పడిగాపులు కాస్తున్నాం. పత్తి విత్తనాలు క్వింటాల్‌కు మార్కెట్ ధర రూ.3,300 ఉంది.

– పత్తి మిల్లుల యాజమానులు

మోసం చేస్తున్న ప్రభుత్వాలు

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు వ్యవహరించే తీరు రైతులను ఆశలతో మోసం చేస్తున్నాయి. గతంలో పరిపాలన సాగించిన ప్రభుత్వాలు పంటలకు నష్టపరిహారం అందించాయి. నేటి ప్రభుత్వాలు వ్యవసాయ సాగు పరికరాలపై రాయితీలకు మంగళం పాడాయి. పత్తి దిగుబడికి ధర లేదు. .వరిపంటలు తెగుళు బారినపడి నశించిపోయాయి. రైతులను ఆదుకునేలా ప్రభుత్వాలు తక్షణ చర్యలు చేపట్టాలి.

– చెప్యాల శ్రీనివాస్, గుగ్గిల్ల రైతు

రికార్డు స్థాయిలో 378 జట్లు

- 6 వెల మంది క్రీడా కారులు ఒకే చోట
- క్రీడా సంబురానికి వేదిక కానున్న సిద్దిపేట స్టేడియం
- సీఎం కేసీఆర్ క్రికెట్ ట్రోపి సీజన్ 3 మ్యాచ్‌ల డ్రా

నవతెలంగాణ-సిద్దిపేట



ముఖ్యమంత్రి కేసీఆర్ జన్మదిన సందర్భంగా సిద్దిపేట ప్రొఫెసర్ జయశంకర్ స్టేడియంలో ప్రతి ఏటా నిర్వహించే క్రికెట్ టోర్నమెంట్లో రికార్డు స్థాయిలో 378 టీములు పాల్గొంటున్నాయని నిర్వాహకులు మచ్చ వేణుగోపాల్ రెడ్డి, కలకుంట్ల మల్లి ఖార్జున్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు సంపత్ రెడ్డిలు తెలిపారు. అంతర్జాతీయ స్థాయి క్రికెట్ స్టేడియంకు ఏ మాత్రం తీసిపోకుండా సిద్దిపేట స్టేడియంను అభివృద్ధి చేసిన ఘనత మంత్రి హరీశ్ రావుకే దక్కుతుందన్నారు. క్రికెట్‌లో గుర్తింపు పొందడానికి గ్రామీణ, పట్టణ క్రీడాకారులకు ఈ టోర్నీ ఒక సువర్ణావకాశం కల్పిస్తుందని తెలిపారు.

సిద్దిపేట స్టేడియంలో ఫిబ్రవరి 17న ప్రారంభం కానున్న సీఎం కేసీఆర్ ట్రోఫీ లీగ్ మ్యాచ్‌లను అధికారులు, ప్రజా ప్రతినిధులు , టీం కెప్టెన్ల సమక్షంలో డ్రా నిర్వహించి ఎంపిక చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ టోర్నమెంట్లో రూరల్, టౌన్ విభాగాలలో మొత్తం కలిపి 378 టీంలు ఎంపియ్యాయని తెలిపారు. టౌన్‌కు సంబంధించి పూల్ ఏ,బీ, సి డి, రూరల్‌కు సంబంధించిన పూల్ ఏ, బి, సి, డి జట్లు వేరువేరుగా పాల్గొంటాయని తెలిపారు. పట్టణం నుంచి ఒక జట్టు రూరల్ నుంచి ఒక జట్టు ఫైనల్‌లో పాల్గొంటాయి అన్నారు. టోర్నమెంట్లో హైదరాబాద్ క్రికెట్ అసోసియేషన్‌కు సంబంధించిన రిఫరీలు ఎంపైర్‌లుగా వ్యవహరిస్తారని, పూర్తి అంతర్జాతీయ నియమ నిబంధనలతో టోర్నీ కొనసాగుతుందన్నారు. ఈ సారి జాతీయ క్రికెట్ దిగ్గజాలు, టాలి హుడ్ హీరోలతో ప్రత్యేక ఆకర్షణగా సిద్దిపేట క్రికెట్ స్టేడియం వేదిక కానుందన్నారు. దేశ చరిత్రలో సీఎం కేసీఆర్ క్రికెట్ టోర్నీ గుర్తింపు రానుందన్నారు. ఇదంతా మంత్రి హరీశ్ రావు ప్రోత్సాహమేనన్నారు. స్టేడియం కూడా కొత్త హంగులతో భారీ స్క్రీన్ తో ఏర్పాటు కానుందని చెప్పారు. టోర్నీ విన్నర్ కు రెండు లక్షల రూపాయల నగదు బహుమతి, రెండవ బహుమతిగా లక్ష రూపాయల నగదుతో పాటు, మ్యాన్ ఆఫ్ ద సిరీస్ 50 వేల రూపాయల నగదు బహుమతి ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బ్రహ్మం, అరవింద్ రెడ్డి, కొల రమేష్, ప్రశాంత్ గౌడ్, బిక్షపతి,యాదగిరి తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్యేపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదు

నవతెలంగాణ-తొగుట



దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్ రావుపై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరి కాదని బీజేపీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం అన్నారు. ఆదివారం మండలంలోని పెద్దమాసాన్ పల్లి గ్రామంలో ఎల్లమ్మ దేవాలయం వద్ద బీజేపీ మండల కార్యవర్గం, శక్తిస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అసెంబ్లీ కన్వీనర్ యెస్ఎన్ చారి, అసెంబ్లీ కొఆర్డినేటర్ విభీషణన్ రెడ్డిలు మాట్లాడుతూ ఫిబ్రవరి 10 నుంచి 25 వరకు జరగాల్సిన శక్తి కేంద్రాల స్థాయి స్ట్రీట్ కార్నర్ సమావేశాల గురించి చర్చిం చారు. భూత్ స్థాయి పార్టీ బలోపేతం 2023 అసెంబ్లీ ఎన్నికల్లో అధికారమే లక్ష్యంగా కార్యకర్తలను సమాయత్తం చేయాలన్నారు. అనంతరం మండల అధ్యక్షుడు మాట్లాడుతూ కేటీఆర్ అసెంబ్లీలో దుబ్బాక ఎమ్మెల్యే రఘునందన్‌రావుపైన అనుచితవ్యాఖ్యలు చేయడం సరికాదన్నారు. ఎన్నికల ముందు కేటీఆర్ చ్చిన హామీలు ఇప్పటి వరకు అమలు చేయలేదని ఎద్దేవా చేశారు. అదేవిధంగా సీఎం కేసీఆర్ ఎన్నికల ముందు రాష్ట్రానికి కాపలా కుక్కలా ఉంటానన్నారని, దళితుడిని ముఖ్యమంత్రి చేస్తానని మోసం చేశారని ఆరోపించారు. హైదరాబాద్ మున్సిపల్ శాఖ మంత్రిగా ఎన్నికైన తరువాత లక్ష బెడ్రూం లు పంచుతామని ఇప్పటి వరకు ఎన్ని డబుల్ బెడ్ రూంలు పంచారని ప్రశ్నించారు. అదే విధంగా దళితులకు మూడు ఎకరాల భూమి,దళి తులకు దళితబంధు ఏమైందన్నారు. రాష్ట్ర ముఖ్య మంత్రిగా రైతులకు 24 లక్షల మెట్రిక్ టన్నుల ఎరు వులు ఇస్తానని హామీ ఇచ్చి 6 సంవత్సరాలు గడుస్తున్నా ఇప్పటికీ ఇవ్వకపోటం సిగ్గుచేటన్నారు. నిరుద్యోగ భృతి, ఇంటికో ఉద్యోగం, గిరిజన బందు లాంటి వన్ని ఉచిత హామీలేనని ఎద్దేవా చేశారు. భూములు కోల్పోయిన రైతులకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ ఇవ్వలేదన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు స్వామి రెడ్డి, చంద్ర శేకర్ గౌడ్, ప్రధాన కార్యదర్శి పరమేష్, బీజేవైఎం అధ్యక్షుడు కళ్యాణ్ దాస్, ఎస్సీ మోర్చ అధ్యక్షుడు ఆంజనేయులు, ఎల్లారెడ్ పేట ఉపసర్పంచ్ ప్రవీణ్ రెడ్డి, ఓబీసీ మోర్చ అధ్యక్షులు రాజశేఖర్, బూత్ అధ్యక్షులు కర్ణాకర్, రమేష్, సాగర్, స్వామి, శ్రీనివాస్, ఎల్లయ్య, బుచ్చిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ కార్యాలయాన్ని ప్రారంభించిన జిల్లా ప్రధాన కార్యదర్శి

నవతెలంగాణ-చేర్యాల



చేర్యాల పట్టణ కేంద్రంలో బీజేపీ కార్యాలయాన్ని ఆదివారం ఆ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బూరుగు సురేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా సురేష్ గౌడ్ మాట్లాడుతూ జనగామ నియోజకవర్గంలో బీజేపీ గెలుపు ఖాయమన్నారు. సిట్టింగ్ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి అవినీతి, భూ కబ్జాలతో నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారని ఆరోపించారు. ఎమ్మెల్యే అక్రమాలను బీజేపీ ఒక్కటే ధైర్యంగా ఎదుర్కొనే శక్తి ఉందన్నారు. తెలంగాణలో గ్రామాలన్నీ అభివృద్ధి పథంలో నడుస్తున్నాయంటే కేంద్ర ప్రభుత్వ నిధులే కారణమన్నారు. సీఎం కేసీఆర్ ఒక్క రూపాయి కూడా ఇచ్చిన దాఖలాలు లేవని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర నాయకులు పోతుగంటి రామదాసు, అంకుగారి శశిధర్ రెడ్డి, జిల్లా కార్యదర్శి లక్ష్మీ, అధికార ప్రతినిధి నర్ర మహేందర్ రెడ్డి, మైనార్టీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎండి.కరీమొ ద్దీన్, బీజేవైఎం జిల్లా అధ్యక్షులు బొంగోని సురేష్ గౌడ్, సీనియర్ నాయకులు సిద్దారెడ్డి, చేర్యాల, మద్దూరు మండలాల అధ్యక్షులు కాశెట్టి పాండు, నలసాని భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

కోటిగల్ సమ్మక్క సారలమ్మలకు ప్రత్యేక పూజలు



నవతెలంగాణ-మద్దూరు

రానున్న మేడారం సమ్మక్క సారలమ్మ జాతరను పురస్కరించుకొని దూల్మిట్ట మండలంలోని కూటిగల్ సమ్మక్క సారలమ్మ దేవతలకు సర్పంచ్ దోమ బాలమణి బాలకృష్ణ ఆధ్వర్యంలో గ్రామస్తులతో కలిసి డబ్బు చప్పులతో ఊరేగింపుగా వెళ్లి సమ్మక్క సారలమ్మలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తున్న సీఎం

సర్పంచ్ మద్దూరు శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-గజ్వేల్



గజ్వేల్ నియోజకవర్గంలో ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం కల్పిస్తున్నారని బయ్యారం గ్రామ సర్పంచ్ మద్దూరు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం ఆయన ఇంటిలో 'నవ తెలంగాణ'తో మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం రాకముందు గ్రామీణ ప్రాంతాల్లో సరైన రోడ్డు సౌకర్యాలు లేవన్నారు. ఈ ఎనిమిది సంవత్సరాలలో ప్రతి గ్రామానికి రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేశారన్నారు. సీఎం కేసీఆర్ ప్రాతినిధ్యం వహిస్తున్న గజ్వేల్ నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేశారన్నారు. సీఎం కేసీఆర్, మంత్రి హరీశ్‌రావు, ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డిల కృషితో నిధులు మంజూరైనట్లు ఆయన అన్నారు. మూడోసారి ముఖ్యమంత్రి కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ అధికారంలోకి వస్తుందని ఆశాభావం వ్యక్తంచేశారు.

విద్య హక్కు చట్టాన్ని పట్టిష్టంగా అమలు చేయాలి

ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్ కుమార్



నవతెలంగాణ-సిద్దిపేట

విద్య హక్కు చట్టాన్ని పట్టిష్టంగా అమలు చేయాలని, కార్పొరేట్ విద్యా సంస్థలు ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు 25 శాతం ఉచితంగా సీట్లు కేటాయించేటట్లు విద్యాశాఖ అధికారులు చూడాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు సంజీవ్ కుమార్ కోరారు. పట్టణంలో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ విద్య హక్కు చట్టాన్ని అన్ని పాఠశాలల్లో అమలయ్యే విధంగా జిల్లా విద్యాశాఖ అధికారులు తనిఖీలు చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎస్ఎఫ్ఐ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

నాందేడ్ సభకు తరలివెళ్లిన బీఆర్ఎస్ శ్రేణులు



నవతెలంగాణ-చేర్యాల

మహారాష్ట్ర మరాఠ యోధుడు ఛత్రపతి శివాజీ గడ్డ మీద బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆదివారం నిర్వహించ తలపెట్టిన నాందేడ్ భారీ బహిరంగ సభకు మండలం నుంచి బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు ముస్త్యాల బాల నర్సయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ శ్రేణులు తరలివెళ్లారు. ఈ సందర్భంగా బాల నర్సయ్య మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సంక్షేమ పథకాలు యావత్ దేశం మొత్తం అందించాలని కేసీఆర్ సూచించినట్లు ఆయన తెలిపారు. తరలివెళ్లిన వారిలో యూత్ అధ్యక్షుడు శివగారి అంజయ్య, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు పెడుతల ఎల్లారెడ్డి, కొమురవెల్లి దేవస్థానం కమిటీ డైరెక్టర్ కొంగరి గిరిధర్, ఏర్పుల మహేష్ తదితరులు ఉన్నారు.

బీజేపీ మండల ప్రధాన కార్యదర్శిగా సతీష్ కుమార్



నవతెలంగాణ-నంగునూరు

నంగునూరు మండలంలోని మగ్దుంపూర్ గ్రామంలో నంగునూరు బీజేపీ మండల అధ్యక్షులు బెదురు కుమారస్వామి ఆధ్వర్యంలో శక్తి కేంద్ర ఇంచార్జిల సమావేశం నిర్వహించారు. రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు గ్రామాల్లో పార్టీ బలోపేతమే లక్ష్యంగా శక్తి కేంద్రాల వారిగా సమావేశం నిర్వహించామని కుమార స్వామి తెలిపారు. అదేవిధంగా నంగునూరు మండల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా బండి సతీష్ కుమార్‌ను, మగ్దుంపూర్ గ్రామ బూతు అధ్యక్షుడుగా కొలుపుల అశోక్‌ను నియమించామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సిద్దిపేట అసెంబ్లీ కన్వీనర్ జలిగామ ఉపేందర్ రావు, జిల్లా కార్యదర్శి వాసర యాదమల్లు,నాయకులు ఉప్పల కృష్ణమాచారి,చిక్కుడు శ్రీనివాస్, బెండల రాజలింగం, బొల్లు తిరుపతి, గుర్రం వెంకటరెడ్డి,అచ్చిన రవి పాల్గొన్నారు.

కోటి తలంబ్రాలు దీక్షలో రామ కోటి భక్త సమాజానికి అవకాశం

నవతెలంగాణ-గజ్వేల్



భద్రాచలంలో రాముల వారి కల్యాణానికి ఉపయోగించే కోటి తలంబ్రాల దీక్ష అద్భుత కార్యక్రమంలో పాల్గొనే ధార్మిక సంస్థలను భద్రాచల దేవస్థానం ఎంపిక చేసింది. ఈ ఎంపికలో గజ్వేల్ పట్టణానికి చెందిన రామకోటి భక్త సమాజం ధార్మిక సేవా సంస్థ కూడా ఉండడం చాలా ఆనందంగా ఉందని సంస్థ వ్యవస్థాపక, అధ్యకులు రామకోటి రామరాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత 20సంవత్సరాల నుంచి ఆధ్యాత్మిక సేవలను భద్రాచలం గుర్తించిందన్నారు. భద్రాచలం నుంచి తమకు వడ్లు రావడం జరిగిందని, భక్తులచే వాటిని గోటిలో మాత్రమే వొలిచి తిరిగి భద్రాచలం దేవస్థానానికి పంపానున్నామన్నారు. శ్రీరామనవమి రోజున సీతారాముల కల్యాణ సమయం లో ఈ తలంబ్రాలను సీతారాములకు ఉపయోగిస్తారన్నారు. ఈ అదృష్టం దక్కడం చాలా ఆనందంగా ఉందని ఆయన చెప్పారు.

సిద్దిపేట మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనం

రూ. 17 కోట్ల నిధులు మంజూరు చేసిన మంత్రి హరీశ్‌రావు

నవ తెలంగాణ-సిద్దిపేట

సిద్దిపేట తెలంగాణ సోషల్ వెల్ఫేర్ ఉమెన్స్ రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాలకు శాశ్వత భవన నిర్మాణానికి ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు రూ.17 కోట్లు మంజూరు చేయించడంతో విద్యార్థులకు ఇబ్బందులు తప్పాయి. సిద్దిపేట విద్యా క్షేత్రంగా విరాజిల్లుతోంది. సిద్దిపేటలో బీసీ, ఎస్సీ, మైనార్టీ రెసిడెన్షియల్స్‌తో పాటు ఉన్నత విద్య కోసం గతంలోనే మహిళా రెసిడెన్షియల్ డిగ్రీ కళాశాల మంజూరు చేశారు. ప్రస్తుతం చేర్యాలలో తాత్కాలిక భవనంలో తరగతులు జరుగుతున్నాయి. సిద్దిపేట అర్బన్ మండలం ఎల్లుపల్లి, మిట్టపల్లి పరిధిలో 6 ఎకరాల్లో రూ.17 కోట్లతో మహిళా డిగ్రీ కళాశాలకు కొత్తగా శాశ్వత భవనాన్ని నిర్మించడానికి మంత్రి హరీశ్‌రావు కృషి చేస్తున్నారు. అధునాతన హంగులు, కార్పొరేట్ రెసిడెన్షియల్ తరహాలో నూతన భవనం ఏర్పాటు చేయనున్నారు. దీని నిర్మాణంతో ప్రస్తుతం తరగతులు నడుస్తున్న చేర్యాల నుంచి విద్యార్థులు తమ స్వంత



భవనానికి రానున్నారు. విద్యార్థులకు అన్ని రకాల సౌకర్యాలు అందనున్నాయి. విద్యార్థులు ఆనందం వ్యక్తం చేస్తూ మంత్రి హరీశ్‌రావుకి కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని శాశ్వత భవనం: రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి హరీశ్‌రావు

విద్యార్థుల ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని శాశ్వత భవనాన్ని ఏర్పాటు చేస్తున్నాం. సిద్దిపేటలో అన్ని రకాల విద్యను అందిస్తూ విద్యా క్షేత్రంగా మారింది. ఈ నూతన భవనంతో మహిళా రెసిడెన్షియల్ కళాశాలలో చదువుతున్న విద్యార్థినులకు అన్ని రకాల సౌకర్యాలు అందడంతో పాటు రక్షణ దొరుకుతుంది.

అంత్యక్రియలకు ఆర్థిక సాయం

నవతెలంగాణ -ఐడిఏబొల్లారం



బొల్లారం మున్సిపల్ పరిధిలోని 13వ వార్డు ఎస్సీ కాలనీకి చెందిన కమలమ్మ(90) అనారోగ్యంతో మృతి చెందింది. విషయం తెలుసుకున్న బీజేపీ నాయకుడు కేజేఆర్ ఆనంద్ కృష్ణారెడ్డి ఆదివారం మృతురాలి కుటుంబీకులను పరామర్శించి అంత్యక్రియలకు రూ.5 వేల సాయం చేశారు. ఆ కుటుంబ సభ్యులు ఆనంద్ కృష్ణారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు.

శివాజీ విగ్రహం కోసం రూ.50వేల విరాళం

నవతెలంగాణ-సంగారెడ్డి



శివాజీ విగ్రహం కోసం రూ.50వేల విరాళాన్ని డీసీసీబీ వైస్ చైర్మెన్ పట్నం మాణిక్యం అందజేశారు. ఆదివారం కంది మండలం ఉత్తరపల్లి గ్రామ హిందూ ఉత్సవ సేవా సమితికి చెందిన సభ్యులు పట్నం మాణిక్యం నివాసం వద్ద శివాజీ విగ్రహం ఏర్పాటు కోసం కలవగా రూ.50 వేల సాయాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్ హిందూ ఉత్సవ సేవ సమితి అధ్యక్షులు, ప్రభాకర్, శివ చారి, ఉదయ్, అఖిల్, రాకేశ్, ప్రశాంత్ పాల్గొన్నారు.

సీఎం కేసీఆర్‌కు నిండుగా దైవం ఆశీస్సులు

ఘనపూర్‌లో లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో పాల్గొన్న ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి



నవతెలంగాణ-తొగుట

దేశ ప్రజల సంక్షేమమే ప రమావధిగా పనిచేస్తున్న సీఎం కేసీఆర్ కు దైవాశిస్సులు నిండు గా ఉన్నాయని మెదక్ ఎంపీ, సిద్దిపేట జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు కొత్త ప్రభాకర్ రెడ్డి పేర్కొన్నారు. శనివారం మండలంలోని ఘనపూర్ గ్రామంలో లక్ష్మీ నర సింహస్వామి బ్రహ్మోత్సవాలకు హాజరై ఎంపీ ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత పాడి అభివృద్ధి చెందుతుందని, పంటలు పుష్కలంగా పండుతున్నాయన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా దేవలయాలు ఉత్సవాలతో గ్రామాల్లో పండుగ వాతావరణం కనిపిస్తుందని హర్షం వ్యక్తం చేశారు. అనంతరం మండలంలోని ప్రజాప్రతినిధు లు పలు విద్యుత్ సమస్యలను ఎంపీ దృష్టి కి తీసుకెళ్లారు. ట్రాన్స్కో డైరెక్టర్ శ్రీనివాస్ రెడ్డితో ఫోన్లో మాట్లాడి సమస్యలు పరిష్కారం చేయాలని సూచించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ చైర్మన్ దోమల కొమురయ్య, వైస్ ఎంపీపీ బాసిరెడ్డి శ్రీకాంత్ రెడ్డి, బీఆర్ఎస్ పార్టీ మండల అధ్యక్షుడు జీడిపల్లి రాంరెడ్డి, రైతుబంధు మండల అధ్యక్షుడు బోధనం కనకయ్య, సర్పంచ్ ల ఫోరం మండల అధ్యక్షుడు సిరినెని గోవర్ధన్ రెడ్డి,సర్పంచ్ లు గంగిని గళ్ల మల్లయ్య, బొడ్డు నర్సింలు, ఎంపీ టీసీ కొమ్ము శరత్, టీఆర్ఎస్ పార్టీ మాజీ మండల అధ్యక్షులు సిలివేరి రాంరెడ్డి, కుంబాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

గజ్వేల్‌లో ఐదువేల ఇండ్లు నిర్మించాలి: బీజేపీ

నవ తెలంగాణ- గజ్వేల్



సీఎం కేసీఆర్ హామీ మేరకు గజ్వేల్‌లో ఐదు వేల ఇండ్లు నిర్మాణం చేసి అర్హులకు అందించాలని బీజేపీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు ఉప్పల మధుసూదన్ అన్నారు. గజ్వేల్ పట్టణం శివ మందిర్‌లో బీజేపీ గజ్వేల్ పట్టణ అధ్యక్షుడు ఉప్పల మధుసూదన్ అధ్యక్షతన జరిగిన భారతీయ జనతా పార్టీ కార్యవర్గ సమావేశానికి గజ్వేల్ పట్టణ ఇంచార్జ్ ధరమ్ గురువా రెడ్డి హాజరయ్యారు. కార్యవర్గ సమావేశంలో బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్ యాదవ్ రాజకీయ తీర్మానం ప్రవేశ పెట్టారు. పట్టణంలో పెండింగ్‌లో ఉన్న పనులు వెంటనే పూర్తి చేయాలని, వార్డ్ గల్లీల రోడ్లు, కోట మైసమ్మ రోడ్ నిర్మాణం పనులు త్వరితగతన పూర్తి చేయాలని ఆయన కోరారు.నిధుల కొరతతో ఆగిపోయిన అండర్ గ్రౌండ్ డ్రైనేజీ త్వరితగతన పూర్తి చేయాలి, క్రీడా స్టేడియం ఏర్పాటు చేయాలి అని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజెపి సీనియర్ నాయకులు యెల్లు రాంరెడ్డి, చిలివేరి జనార్ధన్, బీజెపి జిల్లా కార్యదర్శి కూడిక్యాల రాములు, బిజెపి కో కన్వీనర్ మహేష్, బీజేవైఎం జిల్లా ఉపాధ్యక్షుడు మనోహర్ యాదవ్, బిజెపి మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి నత్తి శివకుమార్, బిజెపి పట్టణ ప్రధాన కార్యదర్శులు పెడియాల శ్రీనివాస్, కోళ్ల నరేందర్, పట్టణ బిజెపి ఉపాధ్యక్షులు మైస విజయ్, నర్సింహ్ చారి, సూర్య రావు, మోర్చాల అధ్యక్షులు మార్కంటి ఏగొండ, రజినీకాంత్, కార్తీక్ పలు పోలింగ్ బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పోడు భూముల సమస్యలను పరిష్కరించాలి: ఎల్‌హెచ్‌పీఎస్

నవతెలంగాణ-హవేలీ ఘనపూర్

మెదక్ జిల్లాలో పోడు భూముల సమస్యలను పరిష్కరించాలని లంబాడి హక్కుల పోరాట సమితి రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ప్రకాష్ రాథోడ్ అన్నారు. ఆదివారం లింగసాన్‌పల్లి తండాలో ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మెదక్ జిల్లాలోని పోడు భూముల సమస్యను పరిష్కరించి, అర్హులైన గిరిజనులకు పట్టా పాసుబుక్ ఇవ్వాలని డిమాండ్ చేశారు. గిరిజనుల ఆరాధ్య దైవం సేవాలాల్ జయంతిని ఫిబ్రవరి 15 అధికారికంగా నిర్వహించాలని, రిజర్వేషన్ కేంద్ర ప్రభుత్వం 9వ షెడ్యూల్లో చేర్చాలని, కేంద్ర ప్రభుత్వం 7-5శాతం నుంచి 14 శాతానికి పెంచాలన్నారు. మెదక్ జిల్లాలో అన్ని తండాలకు



రోడ్డు సౌకర్యం కల్పించనిపక్షంలో లంబాడీ హక్కుల పోరాట సమితి ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున పోరాటం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో లంబాడీ హక్కుల పోరాట సమితి జిల్లా అధ్యక్షులు సురేష్ నాయక్, గోపాల్ నాయక్ ,మెదక్ నియోజకవర్గ అధ్యక్షులు రంజిత్ నాయక్,ఉపాధ్యక్షులు రామావత్ సురేష్,జిల్లా నాయకులు రమేష్, ప్రేమసింగ్ తదితరులు పాల్గొన్నారు.

నియోజకవర్గం అభివృద్ధి కాంగ్రెస్ పార్టీ తోనే సాధ్యం

నవతెలంగాణ-తొగుట

గ్రామాల అభివృద్ధి పనులు జరగాలంటే కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అన్నారు. ఆదివారం హాత్ సే హాత్ జోడో యాత్రలో భాగంగా ఐదోరోజు మండల కేంద్రంలో పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికి తిరుగుతూ ప్రజలను కలుసుకొని వారి యోగ క్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొగుట మండలంలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయన్నారు. పల్లెల్లో ఎక్కడ చూసినా పది చొప్పున బెల్టు షాపులున్నాయని మండిపడ్డారు. ప్రభుత్వం యువతను మద్యానికి బానిసలను చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గతంలో మాజీ మంత్రి స్వర్గీయ చెరుకు ముత్యంరెడ్డి చేసిన అభివృద్ధి పనులే కనబడుతున్నాయని తెలిపారు. నేడు ఏ గ్రామంలో చూసినా సమస్యలు తిష్ట వేశాయని విమర్శించారు. అర్హులైన వారికి సైతం పింఛన్లు మంజూరు చేయడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. డబుల్ బెడ్రూం ఇండ్లు కట్టిస్తామని చెప్పి ప్రజలను మోసం చేశారని తెలిపారు. ఇప్పటివరకు ఒక్క



డబుల్ బెడ్రూం ఇండ్లు ఇవ్వని గ్రామాలు సైతం ఉన్నాయన్నారు. ప్రజలు మార్పు కోరుకుంటున్నారని తెలిపారు. దుబ్బాక నియోజకవర్గ ప్రజలకు న్యాయం చేయాలంటే కాంగ్రెస్‌తోనే సాధ్యం అవుతుందన్నారు. రాబోయే ఎన్నికల్లో దుబ్బాకలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేసి సత్తా చాటుతామని ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు గాంధారి నరేందర్ రెడ్డి, కొంగరి నర్సింలు, గ్రామ కమిటీ అధ్యక్షుడు చిక్కుడు నవీన్, టీపీసీసీ ఫిషర్ మెన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రేపాక తిరుపతి, ఐఎన్టీయుసి దుబ్బాక నియోజకవర్గ అధ్యక్షులు చిక్కుడు బాలమల్లు, గ్రామ ఉపసర్పంచ్ పేర్ల బాల రాజు, మండల సోషల్ మీడియా కన్వీనర్ అఖిల్ గౌడ్, నాయకులు విజయ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బూత్ స్థాయిలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

నవతెలంగాణ-సంగారెడ్డి

బీజేపీని బూత్ స్థాయిలో బలోపేతం చేయడానికి ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని బీజేపీ సంగారెడ్డి పట్ట ణాధ్యక్షుడు ప్రసాది రవిశంకర్ అన్నా రు. బీజేపీ పట్టణ కార్యవర్గ సమావేశాన్ని ఆదివారం జనప్రియ హెూట ల్‌లో రవిశంకర్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మెదక్ పార్లమెంట్ కో-కన్వీనర్ కోవూరి సంగమేశ్వర్ హాజరై మాట్లాడారు. బీజేపీ పార్టీని ప్రజలలోకి తీసుకెళ్లాలని దిశా నిర్దేశం చేశారు. అసెంబ్లీ కన్వీనర్ పోచారం రాములు, అశ్వంత్ , నాయికోటి రమేష్, కౌన్సిలర్ మందుల నాగరాజు, చరక లక్ష్మీ పట్టణ ఉపాధ్యక్షులు సంతోష్ ప్రధానకార్యదర్శి విక్రమ్ శంకర్, సాయికిరణ్,



వినోద్, ఈశ్వర్‌రెడ్డి, వాణిరెడ్డి, వనజ రెడ్డి,సుబ్బలక్ష్మి, చందు, మట్టం శ్రీకాంత్, బూత్ అధ్యక్షులు ఆపై స్థాయి నాయకులు పాల్గొన్నారు.

సబ్బండ వర్గాల అభ్యున్నతే కేసీఆర్ సర్కార్ ధ్యేయం: ఎంపీ



నవ తెలంగాణ-దుబ్బాక

సబ్బండ వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా సీఎం కేసీఆర్ సర్కార్ పని చేస్తోందని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. దుబ్బాక మండల పరిధిలోని పెద్దచీకోడు, శిలాజీనగర్ గ్రామాల్లో ఆదివారం పలు కుల సంఘ భవనాలు, నూతన గ్రామ పంచాయతీ భవనాల నిర్మాణ పనులకు మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి చికోడు, శివాజీ నగర్ సర్పంచులు తౌడ శ్రీనివాస్, మాదారి శంకరయ్యతో కలిసి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ దుబ్బాక నియోజకవర్గంలో అభివృద్ధి పనులు సీఎం కేసీఆర్ సారథ్యంలోని బీఆర్ఎస్ ప్రభుత్వం చేస్తే తామే చేస్తున్నట్లు దుబ్బాక ఎమ్మెల్యే ప్రచారం చేసుకోవడం సిగ్గుచేటని విమర్శించారు. సబ్బండ వర్గాల అభ్యున్నతే ధ్యేయంగా ప్రతి కుల, మత సంఘాలకు నిధులు విడుదల చేసి అండగా ఉంటుంది బీఆర్ఎస్ ప్రభుత్వమని స్పష్టం చేశారు. అనంతరం వెంకటగిరి తండా సర్పంచ్ పాత్‌లోత్ పెంటమ్మ బాలకిషన్ నూతన గృహప్రవేశానికి హాజరయ్యారు. ఎంపీ వెంట ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి, జెడ్పిటిసి కడ్తాల రవీందర్ రెడ్డి, ఎంపిటిసి లు ఎల్.రాంరెడ్డి, ఎం.చంద్రసాగర్, ఆయా గ్రామాల ఉపసర్పంచ్ లు,వార్డు సభ్యులు, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బాణాల శ్రీనివాస్, పలువురు బి ఆర్ ఎస్ నాయకులు పాల్గొన్నారు.

లబ్ధిదారుల ఎంపికపై ఆరా



నవతెలంగాణ-మర్కుక్

మర్కుక్ మండల బీజేపీ కార్యవర్గ సమావేశం ఆదివారం అధ్యక్షుడు తడుపునూరి రమేష్ ఆధ్వర్యంలో నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా సిద్దిపేట జిల్లా అధ్యక్షులు పేర్ల శ్రీనివాస్ హాజరయ్యారు. బూత్ కమిటీల నిర్మాణం, సమస్త గత నిర్మాణంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మండలంలో నెలకొన్న ప్రజా సమస్యలు, ఎర్రవల్లి, నరసన్నపేటలో నిర్మిస్తున్న డబుల్ బెడ్ రూమ్ ల లబ్ధి దారుల ఎంపిక పై అవకతవకలు పై నాయకులను అడిగి తెలుసుకున్నారు. రెండు సంవత్సరాల క్రితం కొండపోచమ్మ ప్రాజెక్టును పర్యాటక కేంద్రంగా ఏర్పాటు చేస్తానని చెప్పి ఇప్పటివరకు రోడ్డు కూడా వేయకపోవడం శోచనీయమన్నారు. హైదరాబాద్ నుంచి ఎంతో మంది పర్యాటకులు వచ్చి ఇక్కడ నీటి వసతులు, కూర్చోడానికి ఏలాంటి వసతులు లేకపోవడంతో తిరిగి వెళ్లిపోవడం జరుగుతుందన్నారు. వెంటనే వీటిపై చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మర్కుక్ మండల ప్రధాన కార్యదర్శి మాచిరెడ్డి తిరుపతిరెడ్డి, బీజేవైఎం అధ్యక్షులు కుషాల్ సింగ్, బీజేవైఎం మండల ప్రధాన కార్యదర్శి ఎర్రగుంట ప్రవీణ్, మండల ఉపాధ్యక్షులు రాజేందర్ సింగ్, ఓబీసీ మోర్చా అధ్యక్షులు పత్తి మహేష్, ఎస్సీ మోర్చా అధ్యక్షుడు సామెల్, నాయకులు అంజిరెడ్డి, కర్ణాకర్, 23 బూతు అధ్యక్షులు తదితరులున్నారు.